E-KABURU Digital News Paper — E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 27-03-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:84 || పేజీలు–6

www.ekaburu.com




## ఇక భీకర యుద్ధమే

- చర్చలపై అమెరికా, ఇరాన్ మధ్య ప్రతిష్టంభన
- పశ్చిమాసియాకు చేరుకుంటున్న అమెరికా నౌకలు, జవాన్లు
- హార్మూజ్ జలసంధిపై పట్టు బిగించిన ఇరాన్
- విదేశీ నౌకల నుంచి టోల్ రుసుము వసూలు
- పశ్చిమాసియాలో 27వ రోజుకు చేరిన దాడులు, ప్రతిదాడులు
- ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ ఐఆర్‌జీసీ నేవీ చీఫ్ అలీ రెజా తంగ్సిరి మృతి

ఈకబురు,దుబాయ్/టెహ్రాన్: పశ్చిమాసియా యుద్ధంమరింత తీవ్రతరమయ్యే సూచనలు కన్పిస్తుండడం ప్రపంచదేశాలకు ఆందోళన కలిగిస్తోంది. హార్మూజ్ జలసంధిని తెరిచే విషయంలో ఇరాన్ పట్టువీడకపోవడం, చర్చలపై షరతులకు అమెరికా ఒప్పుకోకపోవడం, వేలాది మంది అమెరికా జవాన్లు పశ్చిమాసియాలో అడుగుపెడుతుండడం వంటి పరిణామాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇరాన్, అమెరికా మధ్య ప్రతిష్టంభన నెలకొంది. చర్చల విషయంలో ఇరుపక్షాలు తమ వైఖరి నుంచి ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. హార్మూజ్ పై ఇరాన్ తన పట్టును మరింత బిగించింది. జలసంధి గుండా ప్రయాణించే విదేశీ నౌకల నుంచి దారి సుంకం(టోల్ ఫీజు) వసూలు చేస్తోంది.

మిగతా2లో

## చిన్నారులకు నాణ్యమైన విద్య



- పోషకాహారం అందించేలా ప్రత్యేక చర్యలు
- సమగ్ర మానవాభివృద్ధిపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సీఎంతో ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ భేటీ

మిగతా3లో



## గుండెలు పగిలే విషాదం

- ..తెల్లారేలోగానే సజీవ దహనం
- ..13మంది మృత్యువాత
- మార్కాపురం బస్సు ప్రమాద మృతులకు రాష్ట్ర కేబినెట్ సంతాపం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఈ-కబురు, మార్కాపురం ప్రతినిధి :**

అది మాటలకు అందని విషాదం. గుండెలు పగిలే దుఃఖం. ఇంకా తెల్లవారకముందే.. చాలామంది నిద్రలోనే దుర్మరణం చెందారు. మంటల తాకిడికి సజీవ దహనమయ్యారు. ఏపీలో జరిగిన ఈ దారుణం కన్నీరు పెట్టిస్తోంది. సరిగ్గా కొద్ది నెలల క్రితం కర్నూలు జిల్లాలో ఓ ప్రైవేట్ బస్సు కాలిపోయిన సంఘటనను మర్చిపోకముందే.. ఈ దారుణం చోటు చేసుకోవడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురంలో పట్టణంలోని రాయవరం సమీపంలో పలకల క్వారీ వద్ద ఘోరం జరిగింది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టిప్పర్ ను ఢీకొట్టింది. దీంతో ఒకసారిగా మంటలు ఏర్పడ్డాయి. దీంతో ఆ బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో పదమూడు మంది ప్రయాణికులు చూస్తుండగానే సజీవ దహనం అయిపోయారు. ఈ బస్సు జగిత్యాల నుంచి కనిగిరి వెళుతున్నది. విపరీతమైన వేగంతో వెళుతున్న నేపథ్యంలో ఈ దారుణం చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఘటన జరిగిన తర్వాత స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు.


మిగతా2లో



మార్కాపురం జిల్లాలో రోడ్డు ప్రమాదం పట్ల ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి..!



మార్కాపురం బస్సు ప్రమాద ఘటన పై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి



3

## నౌకలు వస్తున్నాయ్.. ఎల్‌పీజీ గ్యాస్, ఆయిల్‌తో విశాఖ పోర్టుకు

ఈ-కబురు, , విశాఖపట్నంమంగళూరు, చెన్నై(ఆర్కేనగర్): విశాఖ తీరానికి ఎల్‌పీజీ, చమురు నౌకలు ఒక్కొక్కటిగా చేరుకోనుండటం ఊరటనిస్తోంది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో గ్యాస్, ఇంధన సమస్యలు తలెత్తుతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



2

## అసెంబ్లీ జరుగుతుంటే ఆటలేంటి?

కేటీఆర్ ధ్వజం

ఈ-కబురు, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో అత్యంత కీలక అంశాలపై చర్చ జరుగుతున్న సందర్భంలో.. ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు

## గంటసేపు ఆకాశంలో చక్కర్లు



### ఎట్టకేలకు క్షేమంగా దిగిన మమతా బెనర్జీ విమానం

ఈ-కబురు, కోల్‌కతా: తుపాను కారణంగా గంటసేపు ఆకాశంలో చక్కర్లు కొట్టిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమానం ఎట్టకేలకు కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్షేమంగా దిగింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మిగతా3లో



### అన్ని రాష్ట్రాల సీఎంలతో

## నేడు మోదీ సమావేశం

ఈకబురు, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ మార్చి 27న వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

02



## బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి

గన్‌పార్కు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

02

## 2 నుంచి సమీకృత భూ భారతి

- ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో..
- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు ఒకే గొడుగు కిందకు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

ఈ-కబురు, హైదరాబాద్: రైతులకు అత్యంత పారదర్శక, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన సమీకృత భూభారతి పోర్టల్



02



### సీఎస్ఆర్ నిధులపై

## ప్రత్యేక పాలసీ

- సమీకరణ, సమర్థ వినియోగమే లక్ష్యం
- ఉత్తమ కార్పొరేట్ సంస్థలకు ఏటా సత్కారం

02



## కేబినెట్ సమావేశం లో కీలక నిర్ణయాలు

**ఈ-కబురు, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ దశ దిశ ను మార్చే కీలక నిర్ణయాలు ఏపీ కేబినెట్ సమావేశం లో తీసుకున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో రాజధాని అమరావతికి సంబంధించి అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. అమరావతికి చట్టబద్ధమైన హోదా కల్పించేందుకు ఉద్దేశించిన తీర్మానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని కోసం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్5ను సవరించి, కొత్త రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మిగతా3లో

## విద్య, వైద్యం.. నిధులు పుష్కలం: సీఎం రేవంత్

- ఆరోగ్యశ్రీతో ఆస్పత్రుల మూత తప్పుడు ప్రచారం
- ఈ పథకం కింద నెలకు సగటున రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- ప్రస్తుతం రూ.727.75 కోట్ల బకాయిలున్నాయి..
- సీఎంఆర్ఎఫ్ చెల్లింపులు కూడా పెరిగాయి..
- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఈకబురు ,హైదరాబాద్: విద్య, వైద్యం.. ఈ రెండు అంశాలు ప్రజా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైనవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ రెండు విభాగాలకు సరిపోయినన్ని నిధులు ప్రభుత్వం కేటాయిస్తుందని, ఎలాంటి పరిస్థితుల్లోనూ కోత విధించబోమని చెప్పారు. లక్ష్య సాధనకు అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించి ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ఎల్పీ ఉప నేతలు హరీశ్‌రావు, సంజయ్ తదితరులు లేవనెత్తిన అంశాలపై సీఎం సమాధానమిచ్చారు.

తప్పుడు ప్రచారం చేస్తున్నారు..

'రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం కింద నెలకు సగటున రూ.89 కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ ఈ పథకం కింది బకాయిలతో ప్రైవేటు ఆస్పత్రులు మూత పడుతున్నాయనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ చెల్లింపులపై కొందరు అపోహలు సృష్టిస్తున్నారు.




02

### నేడు భద్రాద్రిలో

## సీతారాముల కల్యాణం

**ఈ కబురు, భద్రాచలం :**

జగదానంద కారకుడైన శ్రీరాముడు పెళ్లి కొడుకయ్యారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7 గంటల నుంచి జరిగిన ఎదుర్కోలు ఉత్సవం అంబరాన్ని తాకింది. స్వామివారి మూర్తులను ఊరేగింపుగా ఆలయం నుంచి ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చి ఈ వేడుకను వైభవంగా కొనసాగించారు



03

## అన్ని రాష్ట్రాల సీఎంలతో
# నేడు మోదీ సమావేశం



ఆ సీఎంలు దూరంగా..
వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు (Assembly Elections) జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధానిసీఎంల వీడియో కాన్ఫరెన్స్ లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# మార్కాపురం జిల్లాలో రోడ్డు ప్రమాదం పట్ల ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి..!

ఈకబురు, , ఢిల్లీ :
మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించిన ప్రధాని మోదీ. బస్సు ప్రమాదంలో పలువురు సజీవదహనం కావడం అత్యంత విషాదకరం. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా అని ప్రధాని నరేంద్ర మోదీప్రకటించారు.

# 2 నుంచి సమీకృత భూ భారతి



(ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం)ను ఏప్రిల్ 2 నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎన్ఐసీ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ''సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా... భూపరిపాలన సేవలను మరింత వేగంగా అందించేందుకు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయించాం. ప్రతి భూలావాదేవీ వివరాలు అందరికీ కనిపించేలా పోర్టల్‌ను రూపొందించాం. ఈ మేరకు పోర్టల్‌ను నారాయణపేట జిల్లా కోస్గి, రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో ఏప్రిల్ 2 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నాం. ఈ మండలాల్లో పనితీరును పరిశీలించాక రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్‌ను జతపరిచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తాం. తద్వారా భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుంది. ప్రతి సర్వే నంబరుకు ఆధార్ మాదిరిగానే భూధార్ సంఖ్యను ఇస్తాం. ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్‌ను కేటాయించాం. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబరు ద్వారా లాగిన్‌నైన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుంది. ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచార, సర్వే, కరెక్షన్, అప్పీల్, రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు సిటిజన్ డ్యాష్ బోర్డు సేవలు పొందొచ్చు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతిలో ఒకే ఛాప్టర్ కింద అన్ని సేవలను తీసుకొచ్చాం. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి దశలోనూ సంబంధిత వివరాలను తెలియజేస్తూ ఖాతాదారునికి మెసేజ్ అందుతుంది'' అని వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఎన్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

# సీఎస్ఆర్ నిధులపై ప్రత్యేక పాలసీ



ఈకబురు, హైదరాబాద్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల సమీకరణతో పాటు వాటి సమర్థ వినియోగానికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతున్న సంస్థలను ప్రభుత్వం తరపున అభినందించాలని సూచించారు. ప్రతి ఏడాది అత్యుత్తమ భాగస్వామ్యం చూపిన సంస్థల ప్రతినిధులను సత్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని, రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఈ అభినందన ఉత్సవాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.
రాష్ట్ర స్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక కార్యాలయం ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ సెల్ ద్వారా కార్పొరేట్ సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టదగిన కార్యక్రమాల వివరాలన్నింటిని సమన్వయం చేస్తారని సీఎం వివరించారు. సీఎస్ ఆర్ నిధులపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు.
ప్రత్యేక సీఎస్ఆర్ పోర్టల్‌కు రూపకల్పన
ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక తెలంగాణ సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని సీఎం ఆదేశించారు. ఈ పోర్టల్‌లో సీఎస్ఆర్ విరాళాలు అందించేందుకు, వివిధ విభాగాల పరిధిలో అమలు చేయదగిన ప్రాజెక్టుల వివరాలను సమగ్రంగా పొందుపరచాలని సూచించారు.

# మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

ఈకబురు,హైదరాబాద్:
మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో పలువురు మంది మృతి చెందడం.. కొందరికి తీవ్ర గాయాలపాలవడంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు. బస్సు నిర్మల్ నుంచి నెల్లూరు వైపు వెళుతున్న నేపథ్యంలో బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారు.. గాయపడిన వారి వివరాలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని సీఎం సూచించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం సహాయం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఏపీ సీఎస్‌తో మాట్లాడారు.

# విద్య, వైద్యం.. నిధులు పుష్కలం: సీఎం రేవంత్

2023 డిసెంబర్ 7వ తేదీ నాటికి ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.627 కోట్లు ఉంటే.. వారసత్వంగా వచ్చిన ఆ బకాయిలను చెల్లిస్తూనే ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం.
ప్రజా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి ఇప్పటివరకు రూ.2,408.51 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.927.99 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1480.52 కోట్లు విడుదల చేశాం. ప్రస్తుతం రూ.727.75 కోట్ల బకాయిలున్నాయి. వారసత్వ బకాయిలు మరో రూ.100 కోట్లు ఉన్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి సహాయ నిధి చెల్లింపులు కూడా భారీగా పెరిగాయి. ఇప్పటివరకు దీని కింద రూ.2,046 కోట్లు ఇచ్చాం. సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ కింద దాదాపు రూ.4,500 కోట్లు ఖర్చు చేశాం..'అని సీఎం వివరించారు.
బోధనాసుపత్రులకు ఆరోగ్యశ్రీ రోగులు
రాష్ట్రంలో 35 మెడికల్ కాలేజీలున్నాయి. బోధనాసుపత్రులకు రోగుల తాకిడి తక్కువగా ఉంది. పేదలు వైద్యం కోసం వెళ్లే దగ్గర కొన్నిచోట్ల సరైన డాక్టర్లు లేరు..రోగులున్న చోట నిపుణులు లేరు. అందువల్ల ఆరోగ్యశ్రీ రోగులను బోధనాసుపత్రులకు పంపించాలనుకుంటున్నాం. ఆరోగ్యశ్రీతో పాటు సీఎంఆర్ఎఫ్‌ను ఈ ఆస్పత్రులకు ఇస్తాం. దీంతో ఆస్పత్రుల నిర్వహణ మెరుగుపడుతుంది.
ఈ ఆస్పత్రుల పర్యవేక్షణకు గ్రూప్-1 లేదా గ్రూప్-2 అధికారులను నియమిస్తాం. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా అమలు చేయనున్నాం. ఇది ప్రతి కుటుంబానికి ప్రభుత్వం కల్పించే ధీమాగా మారుతుంది. విదేశాల్లో ఉండే తెలుగు డాక్టర్ల సేవలు వినియోగించుకునేలా, ఇక్కడికి వచ్చినప్పుడు చికిత్స అందించేలా ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ తయారు చేస్తున్నాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు.
ఆరోగ్యశ్రీపై ప్రైవేటు ఆస్పత్రుల ఆసక్తి: మంత్రి దామోదర
ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు ప్రైవేటు ఆస్పత్రులు ఉత్సాహం చూపిస్తున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్తగా 330 కార్పొరేట్ ఆస్పత్రులు చేరాయన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులకు క్రమం తప్పకుండా చెల్లింపులు జరుగుతున్నాయని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు.
పెట్టుబడులపై ఓర్వలేకే విమర్శలు: మంత్రి శ్రీధర్‌బాబు
ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, వాటిని చూసి ప్రతిపక్ష పార్టీ



నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. దావోస్ పెట్టుబడులు, ఇతర అంశాలపై సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. దావోస్‌కు వెళ్లిన 2024, 2025 సంవత్సరాల్లో మొత్తం 44 ఎంవోయూలు చేసుకోవడం ద్వారా రూ. 2,19,182 కోట్లు పెట్టుబడులు రానున్నట్లు వివరించారు. ఎంవోయూలు, పెట్టుబడులు, కంపెనీలు తదితర అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

# ఇక భీకర యుద్ధమే!

కనీసం రెండు నౌకలు చైనా కరెన్సీ యువాన్లలో ఇరాన్‌కు చెల్లింపులు చేసినట్లు స్థానిక వార్తా సంస్థలు వెల్లడించాయి. పార్లమెంట్‌లో ఆమోదం పొంది టోల్ వసూలును అధికారం చేయబోతున్నట్లు సమాచారం. నౌకలు క్షేమంగా జలసంధిని దాటాలంటే రుసుము చెల్లించక తప్పదని ఇరాన్ అధికారులు అంటున్నారు. హార్ముజ్‌లో ఇరాన్ టోల్ బూత్ తెరిచినట్లు ఆరు గల్ఫ్ అరబ్ దేశాల కూటమి అయిన గల్ఫ్ సహకార మండలి ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అల్-బుదైవీ నిర్ధారించారు. నౌకల నుంచి టోల్ వసూలు చేస్తే హార్ముజ్ నుంచి చమురు దిగుమతి చేసుకొనే దేశాల్లో ధరలు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.
గల్ఫ్‌లో క్షిపణుల మోత
మరోవైపు యుద్ధం గురువారం 27వ రోజుకు చేరుకుంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా ఇతర నగరాలపై ఇజ్రాయెల్ సైన్యం క్షిపణుల వర్షం కురిపించింది. ఇరాన్‌సైతం ప్రతీకార దాడులు కొనసాగించింది. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలే లక్ష్యంగా మిస్సైళ్లు, డ్రోన్లు ప్రయోగించింది. ఇరాన్ మౌలిక సదుపాయాలపై దాడులకు దిగినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ సైనిక స్థావరాలకు కేంద్రమైన ఇస్ఫహాన్‌లో భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. తమ దాడుల్లో ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డు కోర్(ఐఆర్‌జీసీ) నేవీ చీఫ్ అలీ రెజా తంగ్సిరి అంతమైనట్లు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తేల్చిచెప్పారు.
యుద్ధంలో ఉమ్మడి లక్ష్య సాధన విషయంలో అమెరికా, ఇజ్రాయెల్ మధ్య సమన్వయానికి ఈ ఆపరేషన్ మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌లోనూ శబ్దాలు వినిపించినట్లు స్థానికులు చెప్పారు. ఇజ్రాయెల్‌లోని నహరియా ఏరియాలో ఇరాన్ దాడుల్లో ఒకరు మరణించినట్లు తెలిసింది. మరో ఏడుగురు గాయపడినట్లు సమాచారం. ఇరాన్‌లోనూ మృతుల సంఖ్య పెరుగుతోంది. యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటిదాకా 1,900 మందికిపైగా మరణించినట్లు ఇరాన్ మంత్రి అలీ జఫారియన్ చెప్పారు. ఇజ్రాయెల్‌లో 18 మంది, లెబనాన్‌లో ముగ్గురు ఇజ్రాయెల్ జవాన్లు, 1,100 మంది సాధారణ ప్రజలు, గల్ఫ్ దేశాల్లో 13 మంది అమెరికా సైనికులు మృతిచెందారు. లెబనాన్‌లో హెజ్‌బొల్లా మిలిటెంట్లను ఖతం చేయడమే ధ్యేయంగా ఇజ్రాయెల్ తమ సైన్యాన్ని అక్కడికి తరలిస్తోంది.
భారతీయుడు సహా ఇద్దరి బలి
అబుదాబీపై ఇరాన్ భారీగా క్షిపణులు ప్రయోగించింది. యూఏఈ గగనతల వ్యవస్థ వాటిని గాల్లోనే నిర్వీర్యం చేసే క్రమంలో విషాదం చోటుచేసుకుంది. క్షిపణుల శకలాలు నేలకూలి మంటలు చెలరేగడంతో ఒక భారతీయుడు సహా ఇద్దరు మరణించారు. మరో భారతీయుడు సహా ముగ్గురు గాయపడ్డారు. మృతిచెందిన రెండో వ్యక్తిని పాకిస్తాన్ జాతీయుడిగా గుర్తించారు. పశ్చిమాసియా యుద్ధంలో మృతుల సంఖ్య 11కు చేరుకుంది. 169 మంది గాయపడ్డారు. ఇరాన్ నుంచి ఎలాంటి ముప్పు ఎదురైనా తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు అబు దాబీ రక్షణ శాఖ ప్రకటించింది.
ఇరాన్‌లో 10 వేల టార్గెట్లపై దాడులు
ఇరాన్‌లో ఇప్పటిదాకా 10 వేలకుపైగా టార్గెట్లపై దాడులు చేసినట్లు అమెరికా సైన్యానికి చెందిన సెంట్రల్ కమాండ్ చీఫ్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు. ఇజ్రాయెల్‌తో కలిసి మరిన్ని లక్ష్యాలపై గురిపెడతామని అన్నారు. కచ్చితత్వంతో కూడిన దాడులతో ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థపై పైచేయి సాధిస్తున్నామని చెప్పారు. ఇరాన్ నావికాదళంలో 92 శాతం భారీ నౌకలను ధ్వంసం చేశామని తెలిపారు. తాజా పరిణామాలను దృష్టిలో పెట్టుకొని అమెరికా తమ సైన్యాన్ని పశ్చిమాసియాకు తరలిస్తోంది. యూఎస్ఎస్ ట్రిపోలి సహా పలు నౌకలు పశ్చిమాసియా సమీపానికి చేరుకుంటున్నాయి. వీటిలో 2,500 మంది జవాన్లు ఉన్నారు. అలాగే 1,000 మంది పారాట్రూపర్లు కూడా రంగంలోకి దిగుతున్నారు.
సంధానకర్తగా పని చేస్తున్నాం: పాక్
పశ్చిమాసియాలో సంక్షోభ పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలే శరణ్యమని పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ చెప్పారు. యుద్ధానికి తెరదించడమే లక్ష్యంగా అమెరికా, ఇరాన్ మధ్య తాము సంధానకర్తగా పని చేస్తున్నట్లు గురువారం తెలిపారు. ఒక దేశం సందేశాన్ని మరో దేశానికి చేరవేస్తున్నామని పేర్కొన్నారు. శాంతి సాధన విషయంలో తుర్కియే, ఈజిప్టు కూడా తమకు సహకరిస్తున్నాయని వెల్లడించారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం కోసం తమ ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటామని స్పష్టంచేశారు.
అంచెలంచెలుగా ఉన్నతస్థాయికి
అలీ రెజా తంగ్సిరి మృతితో ఇరాన్‌కు భారీ నష్టం
జెరూసలేం: ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అత్యంత శక్తివంతమైన ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) నావికాదళం చీఫ్ అలీ రెజా తంగ్సిరి మృతిచెందారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ స్వయంగా ప్రకటించారు. ఇరాన్‌లోని తీరప్రాంత నగరమైన బందర్ అబ్బాస్‌లో వైమానిక దాడుల్లో తంగ్సిరితోపాటు ఐఆర్‌జీసీకి చెందిన ఇతర సీనియర్ నావల్ కమాండర్లు కూడా హతమైనట్లు తెలిపారు. అయితే, దీనిపై ఇరాన్ ఇంకా స్పందించలేదు.
హార్ముజ్ జలసంధి మూసివేతను తంగ్సిరి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అలాంటి కీలక అధికారి మృతిచెందడం ఇరాన్‌కు భారీ నష్టంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తంగ్సిరి దక్షిణ ఇరాన్‌లోని బుషెహర్ ప్రావిన్స్‌లో 1962లో జన్మించారు. 1980వ దశకంలో ఇరాన్-ఇరాక్ యుద్ధంలో పాల్గొన్నారు. ఇరాన్ సైన్యంలో అంచెలంచెలుగా పైకి ఎదిగారు. 2010 నుంచి 2018 దాకా ఐఆర్‌జీసీ నేవీ డిప్యూటీ కమాండర్‌గా పనిచేశారు. అనంతరం ఈ దళం అధినేతగా బాధ్యతలు చేపట్టారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు మొదలైన తర్వాత హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. అక్కడ విదేశీ నౌకల రాకపోకలను అడ్డుకుంటోంది. ఇదంతా తంగ్సిరి నేతృత్వంలోనే జరిగింది. ఇజ్రాయెలీలు యూదులని, అమెరికన్లు క్రైస్తవులని, వారు తమకు మిత్రులు కాదని మత గ్రంథం ఖురాన్ బోధిస్తోందని ఒక సందర్భంలో తంగ్సిరి వ్యాఖ్యానించారు. యుద్ధంలో ఇరాన్ కీలక నేతలు, అధికారులు ఒక్కొక్కరుగా మరణిస్తుండడం ఆ దేశానికి నష్టదాయకంగా పరిణమించింది. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి అలీ మొహమ్మద్ నైనీ తదితరులు మృతిచెందిన సంగతి తెలిసిందే.
తంగ్సిరి చేతులకు చాలా రక్తం అంటింది: నెతన్యాహు
అలీ రెజా తంగ్సిరి మృతిని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సైతం ధ్రువీకరించారు. ఈ మేరకు వీడియో స్టేట్‌మెంట్ విడుదల చేశారు. బుధవారం రాత్రి ఐఆర్‌జీసీ నేవీ కమాండర్ తంగ్సిరిని అంతం చేసినట్లు తెలిపారు. అతడి చేతులకు చాలా రక్తం అంటిందని, హార్ముజ్ జలసంధిని మూసివేయడానికి నాయకత్వం వహించింది కూడా అతడేనని తేల్చిచెప్పారు. ఇరాన్ నేతలు, అధికారులే లక్ష్యంగా దాడులు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఇరాన్ ఉగ్రవాద పాలనపై దాడులు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.
ఒప్పందం కోసం ఇరాన్ బతిమాలుతోంది: ట్రంప్
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 15 సూత్రాల కాల్పుల విరమణ ప్రణాళికను ఇరాన్ రెండో మాటకు తావులేకుండా తిరస్కరించింది. దీనిపై ట్రంప్ గురువారం స్పందించారు. ఒప్పందం కోసం ఇరాన్ తమను బతిమాలుతోందని అన్నారు. చర్చల కోసం తాను ఒత్తిడి చేయడం లేదని చెప్పారు. యుద్ధాన్ని ముగించే ఒప్పందంపై జరిగే చర్చలను సీరియస్‌గా తీసుకోవాలని టెహ్రాన్‌కు సూచించారు. ఇరాన్ ఒక బహుమతి ఇచ్చిందని ట్రంప్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ బహుమతి ఏమిటన్నది ఇప్పుడు బయటపెట్టారు. 10 చమురు నౌకలు హార్ముజ్ గుండా వెళ్లడానికి ఇరాన్ అనుమతి ఇచ్చిందని చెప్పారు. చర్చల విషయంలో ఇదొక సానుకూల ముందడుగు అని అభివర్ణించారు. అనుమతి పొందిన నౌకలు పాకిస్తాన్‌కు చెందినవిగా ట్రంప్ సంకేతాలిచ్చారు. తదుపరి సుప్రీంలీడర్‌గా ఉండాలంటూ ఇరాన్ తనను వేడుకుందని, అందుకు తిరస్కరించానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆ

# గుండెలు పగిలే విషాదం



పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సహాయక చర్యలను ముమ్మరం చేసినప్పటికీ ప్రాణనష్టాన్ని నివారించలేకపోయారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికంగా ఉన్న ఒక ఆసుపత్రికి తరలించారు. అయితే చాలామందికి గాయాలు అయిన నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.
**ప్రమాదానికి అదే కారణం**
ప్రైవేట్ ట్రావెల్ బస్సు విపరీతమైన వేగంతో ఉన్నట్టు తెలుస్తోంది. అదే వేగంతో పలకల క్వారీల వద్ద మలుపులు తిరుగుతుండగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. టిప్పర్ కూడా అధికమైన వేగంతో ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 35 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. బస్సు కాలిపోతున్న నేపథ్యంలో వెనుక భాగంలో ఉన్నవారు ముందుకు రాలేక కన్నుమూసినట్టు సమాచారం. బస్సు ముందు భాగంలో ప్రయాణిస్తున్న పదిమంది ప్రయాణికులు మాత్రమే తమ ప్రాణాలను కాపాడుకున్నారు. చనిపోయిన వారిలో ఎక్కువగా కనిగిరి ప్రాంతానికి చెందిన వారు ఉన్నట్టు తెలుస్తోంది. ఘటన స్థలాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఎస్పీ నరసింహారాజు తదితరులు పరిశీలించారు.
**మార్కాపురం బస్సు ప్రమాద మృతులకు రాష్ట్ర కేబినెట్ సంతాపం**
**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**
మార్కాపురం జిల్లాలో బస్సు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోన్న వారికి రూ.2 లక్షల చొప్పున సాయం అందించాలని సూచించారు. మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర మంత్రివర్గం గురువారం తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. బస్సు ప్రమాద ఘటనలో పలువురు మృతి చెందటం పట్ల సంతాపాన్ని తెలిపింది. బాధిత కుటుంబాలకు రాష్ట్ర మంత్రివర్గం సానుభూతిని తెలియచేసింది. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని, బాధితులకు అందుతున్న వైద్యాన్ని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాల నివారణతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు రవాణా, రహదారులు & భవనాల శాఖ, పోలీసు, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రణాళికలు అమలు చేసి ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. రాయవరం ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.



## బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి

ఈ-కబురు, హైదరాబాద్: బీసీలకు సబ్ ప్లాన్ అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గురువారం గన్‌పార్కులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో.. పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని, బీసీలకు ఆత్మ గౌరవ భవనాలు నిర్మించాలని, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

గన్‌పార్కు నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీగా చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ప్రధాన ద్వారం వద్ద ప్లకార్డులు చూపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ప్రతీ వార్షిక బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలను మోసగించారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బీసీలు సమాధి చేయడం ఖాయమని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.

## అసెంబ్లీ జరుగుతుంటే ఆటలేంటి?



ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించడం సరికాదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ లాబీలో ఆయన గురువారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''ప్రభుత్వం ప్రజాసమస్యల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. ఇరిగేషన్ వంటి అత్యంత ముఖ్యమైన సబ్జెక్టులపై సభలో లోతైన చర్చ జరగాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం మాత్రం పద్దులపై చర్చను త్వరగా ముగించాలని చూస్తోంది. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన 28, 29 తేదీల్లో ఎమ్మెల్యేలు మైదానాల్లో ఆటలు ఆడుతుంటే.. సభను చూస్తున్న ప్రజలు ఏమనుకుంటారు? ఈ విషయాన్ని నేను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తే.. ఆయన వద్ద ఎటువంటి సమాధానం లేదు. అసెంబ్లీ సమావేశాల కాలాన్ని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించకుండా.. ఇలాంటి కార్యక్రమాలతో కాలయాపన చేయడం సరికాదు. పద్దులపై చర్చకు తగినంత సమయం కేటాయించకుండా ఎమ్మెల్యేల క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనం. ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకే ఈ క్రీడా పోటీలను ప్రభుత్వం ఒక సాకుగా చూపిస్తోంది'' అని కేటీఆర్ విమర్శించారు.

## పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేస్తాం



ఈ-కబురు, హైదరాబాద్: దావోస్‌లో నిర్వహించిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుల ద్వారా రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తుంటే ఓర్వలేక విపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. పెట్టుబడులు, అవగాహన ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గురువారం శాసనసభలో దావోస్ పెట్టుబడులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. "ఎంవోయూలు కుదుర్చుకున్న తర్వాత అవి కార్యరూపంలోకి రావడానికి సమయం పడుతుంది. దీనిపై అవగాహన లేకుండా కొందరు సభ్యులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఎంవోయూను అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. 2024 దావోస్ పర్యటనలో 18 ఎంవోయూల ద్వారా రూ.40,232 కోట్లు, 2025 పర్యటనలో 26 ఎంవోయూల ద్వారా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో వచ్చిన 6 కంపెనీలకు భూములు కేటాయించాం. దీనివల్ల ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం సమకూరింది. రూ.30 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే మరో 3 కంపెనీలకు భూములను గుర్తించాం. నిజామాబాద్ ఐటీ టవర్‌లో 11 కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 276 మంది పని చేస్తున్నారు. సిద్దిపేట టవర్‌లో పనిచేస్తున్న సంస్థలకు మరో మూడేళ్ల పాటు రాయితీలు కొనసాగిస్తాం. ముఖ్యమంత్రి చొరవ వల్ల ఖమ్మంలో త్వరలోనే స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ ప్రారంభం కాబోతోంది. కేంద్ర మంత్రి కుమారస్వామి వచ్చి దీనిపై ప్రకటన చేస్తారు. ఆదిలాబాద్‌లో సీసీఐని పునఃప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

# చిన్నారులకు నాణ్యమైన విద్య




ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర శాసనమండలి హాలులో సీఎంతో గురువారం ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్ష సమావేశంలో పలు అంశాలపై వారు చర్చించారు. తెలంగాణలో 010 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం.. విద్యాభ్యాసన స్థాయి సామర్థ్య లోపాలకు సంబంధించి పలు నివేదికలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కార్తీక్ మురళీధరన్ తీసుకువచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారలోపంతో భవిష్యత్‌లో పిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలు.. ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను వివరించారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సీఎంకు సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు సీఎం వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. దీంతో 'పోషణ సఖి' పేరుతో నియమించేందుకు అవకాశముందని అధికారులు తెలిపారు. కార్తీక్ మురళీధరన్ సూచించే అంశాలను 'కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్)' పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం.. అధికారులకు సూచించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, సీఎస్ కె.రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ప్రణాళికశాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేబినెట్ సమావేశం లో
# కీలక నిర్ణయాలు



ఈ మేరకు శనివారం జరగనున్న ప్రత్యేక శాసనసభ సమావేశంలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదం తెలుపనున్నారు. అనంతరం, పునర్విభజన చట్టంలో సవరణల కోసం ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. ఈ చర్యతో అమరావతి రాజధానికి చట్టపరమైన భద్రత లభించనుంది. అదేవిధంగా ఈ సమావేశంలో మరిన్ని కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో కొత్తగా 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, నీరుకొండలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. వీటితో పాటు, ఖనిజ లీజుల కేటాయింపులో వడ్డెర సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని నిర్ణయించారు. 202526 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసే ప్రతిపాదనకు, కుప్పం బాలికల పాఠశాలలో కొత్త పోస్టుల మంజూరుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదేవిధంగా మార్కాపురం లో జరిగిన బస్సు ప్రమాదం పై కూడా కేబినెట్ లో సుదీర్ఘంగా చర్చించారు

## గంటసేపు ఆకాశంలో చక్కర్లు



. పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో ఎన్నికల ప్రచారం ముగించుకుని గురువారం సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో మమతా బెనర్జీ.. కోల్‌కతాకు బయలుదేరారు. అది 4 గంటల సమయంలో దిగాల్సి ఉంది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో అప్పటికే కోల్‌కతా విమానాశ్రయంలో విమానాలకు అంతరాయం కలుగుతోంది. ఆకస్మికంగా ఉరుములు, భారీ వర్షం, బలమైన గాలులు రావడంతో విమానాలు దిగడానికి ఇబ్బంది తలెత్తింది. 20 నిమిషాలపాటు విమానాల ల్యాండింగ్‌కు అనుమతివ్వలేదు. దీంతో గంటపాటు మమతా బెనర్జీ విమానం గాలిలో చక్కర్లు కొట్టింది. చివరకు 5.19 గంటలకు క్షేమంగా దిగింది.

## నౌకలు వస్తున్నాయ్..
### ఎల్‌పీజీ గ్యాస్, ఆయిల్‌తో విశాఖ పోర్టుకు



ఈ సమయంలో గ్యాస్, ఆయిల్‌తో నౌకలు విశాఖకు చేరుతుండటంతో సరఫరా సమస్యలు తీరనున్నాయి. 24 వేల మెట్రిక్ టన్నులు (టీఎంటీ) ఎల్‌పీజీ గ్యాస్‌తో 'బీడబ్ల్యూ బ్రిచ్' అనే భారీ నౌక గురువారం విశాఖ తీరానికి చేరింది. శుక్రవారం ఈ నౌక గ్యాస్‌ను అన్‌లోడ్ (ట్రాన్షిప్‌మెంట్) చేయనున్నారు. అదేవిధంగా నెదర్లాండ్స్‌లో లోడింగ్ చేసుకున్న హెల్లాస్ గ్లాడియేటర్, అమెరికా పోర్టులో లోడింగ్ చేసుకున్న జుపిటర్ నౌకలు ఈ నెల 30న విశాఖ చేరుకోనున్నాయి. ఇప్పటికే లుపినస్ (22 టీఎంటీ), ఏఐ వుకిర్ (26 టీఎంటీ) నౌకలు యూఏఈ, ఖతార్ నుంచి గత నెల 26, ఈ నెల 3న విశాఖ చేరుకున్నాయి.

డీజిల్, క్రూడ్ ఆయిల్‌తో

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)కు సంబంధించి ఎంవీ సమర్‌శృతి నౌక విశాఖ పోర్టులో యాంకరేజీలో లంగర్ వేసి ఉంచారు. 65 వేల టన్నుల హైస్పీడ్ డీజిల్‌ను అన్‌లోడ్ చేస్తున్నారు. ఎంవీ స్వర్ణ సింధు అనే క్రూడ్ ఆయిల్ నౌక హెచ్‌పీసీఎల్ కోసం మరో రెండు రోజుల్లో చేరుకోనుంది. శుక్రవారం నాటికి రష్యా నుంచి జంబో నౌక 1,36,728 టన్నుల క్రూడ్ ఆయిల్‌తో విశాఖ పోర్టుకు చేరుకోనుంది. వచ్చే నెల 2, 5వ తేదీల్లో ఫొండేయ (రష్యా నుంచి), దేశ్ గౌరవ్ (ముంద్రా పోర్టు) నౌకలు ముడి చమురుతో రానున్నాయి. ఈ నెల 1 నుంచి 25 వరకు ఇరాక్, రష్యా, ఖతార్, యూఏఈ, భారత దేశంలోని పలు పోర్టుల నుంచి పది చమురు నౌకలు విశాఖకు చేరినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

కర్ణాటకలోని న్యూ మంగళూరు పోర్టుకు 40 వేల టన్నుల ఎల్‌పీజీతో 'అపోలో ఓషియన్' నౌక గురువారం సాయంత్రం చేరుకుంది. ముడి చమురుతో మరో రెండు నౌకలు త్వరలో రేవుకు వస్తాయని అధికారులు ప్రకటించారు.

రష్యా నుంచి లక్ష టన్నుల ముడి చమురుతో మూడో నౌక గురువారం చెన్నై హార్బర్‌కు చేరింది. మరొకటి శనివారం రానుంది.


## రామాలయం
### అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక:మంత్రి తుమ్మల



ఈ కబురు, భద్రాచలం:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. బృహత్తర ప్రణాళికలో భాగంగా మొదటి విడతగా రూ.351 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. శ్రీరామనవమి కల్యాణ ఏర్పాట్లను గురువారం మంత్రి పర్యవేక్షించారు. కల్యాణ మండపం వద్ద వీవీఐపీలు, సామాన్య భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. సెక్టార్ల రూపకల్పనతో పాటు అన్నిరకాల కౌంటర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. శుక్రవారం జరిగే కల్యాణానికి సీఎం రేవంత్‌రెడ్డి ముత్యాల తలంబ్రాలు పట్టుకుని వచ్చి అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆలయ అభివృద్ధి నమూనాలను ప్రదర్శించారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని కరకట్టలు విస్తరించాల్సి ఉందని, ఘాట్‌ల నిర్మాణం చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు, ఈఓ దామోదర్‌రావు తుమ్మల వెంట ఉన్నారు.

## నేడు భద్రాద్రిలో
# సీతారాముల కల్యాణం



ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, ఈఓ దామోదర్‌రావు ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి ఎదుర్కోలు వేడుకను తిలకించారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా నిర్వహిస్తారు. తెల్లవారుజాము 2 గంటలకు ఆలయం తలుపులు తెరిచి సుప్రభాత సేవ చేసి తిరువారాధన చేపట్టాక మూలవరులకు అభిషేకం చేసి ధ్రువమూర్తుల కల్యాణం నిర్వహించనున్నారు. ఆ తర్వాత కల్యాణమూర్తులకు అలంకారం చేసి ఊరేగింపుగా మిథిలా మండపానికి తీసుకువెళ్తారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీసీతారామ కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

## పశ్చిమాసియాను ఇరాన్ స్వాధీనం చేసుకోవాలనుకుంది: ట్రంప్



ఈకబురు, వాషింగ్టన్: ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఒమన్ దేశాలను ప్రత్యేకించి ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) ఆరోపించారు. పశ్చిమాసియాను స్వాధీనం చేసుకునేందుకు ఆ దేశం వద్ద ప్రణాళిక ఉందని వ్యాఖ్యానించారు. క్యాబినెట్ సమావేశంలో ట్రంప్ ఈ మేరకు మాట్లాడారు. ''ఆయా దేశాలపైకి ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో కొన్ని యుద్ధం ప్రారంభానికి చాలా కాలం ముందే నుంచే గురి పెట్టి ఉన్నాయి. వాటిని లోడ్ చేసి దాడులకు సిద్ధంగా ఉంచింది. పశ్చిమాసియాను స్వాధీనం చేసుకోవాలనుకుంది. కానీ, మేం అడుగుపెట్టడంతో అది కష్టతరమవుతోంది'' అన్నారు. యుద్ధాన్ని నిలిపివేసేందుకు రూపొందించిన 15 పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ముందు ఉంచినట్లు అమెరికా తొలిసారి అధికారికంగా వెల్లడించింది. క్యాబినెట్ సమావేశంలో ట్రంప్ ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ దీనిపై ప్రకటన చేశారు. ఒప్పందం కుదిరేందుకు బలమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మరోవైపు.. ఈ ఒప్పందం కోసం ఇరాన్ ప్రతినిధులే బతిమాలుకుంటున్నారని, తాను కాదని ట్రంప్ అన్నారు. అణు కార్యక్రమాలను శాశ్వతంగా వదులుకుని, ఒక కొత్త మార్గాన్ని ఎంచుకునేందుకు ఇరాన్‌కు ఇప్పుడు అవకాశం లభించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకపోతే ఇరాన్‌కు తాము పీడకలగా మారతామని హెచ్చరించారు

## ఇన్ఫోసిస్ చేతికి ఆప్టిమమ్ హెల్త్ కేర్ ఐటీ, స్ట్రాటస్

### లావాదేవీల విలువ రూ.5,260 కోట్లు




దిల్లీ: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే హెల్త్‌కేర్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కంపెనీ ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ, ఇన్సూరెన్స్ కన్సల్టింగ్ టెక్నాలజీ కంపెనీ స్ట్రాటస్‌లను సుమారు రూ.5,260 కోట్లతో కొనుగోలు చేయనున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీని 465 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,370 కోట్ల)తో ఇన్ఫోసిస్ కొనుగోలు చేయనుంది. ఇందులో ముందస్తు చెల్లింపులు, ఎర్నౌట్‌లు కలిపి ఉంటాయి. యాజమాన్య ప్రోత్సాహకాలు, నిలుపుదల బోనస్‌లు మినహాయిస్తారు. షరతులు పూర్తయిన తర్వాత, ఈ కొనుగోలు 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో పూర్తికావచ్చని అంచనా. ప్రోపర్టీ అండ్ క్యాజువాల్టీ (పి అండ్ సి) టెక్నాలజీ సొల్యూషన్స్ సేవల సంస్థ స్ట్రాటస్‌ను 95 మిలియన్ డాలర్ల (సుమారు రూ.890 కోట్ల) నగదు చెల్లింపుతో కొనుగోలు చేసేందుకు ఇన్ఫోసిస్ కచ్చితమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో ముందస్తు చెల్లింపులు, ఎర్నౌట్‌లు కలిసి ఉంటాయి. యాజమాన్య ప్రోత్సాహకాలు, నిలుపుదల బోనస్‌లు మినహాయిస్తారు.

## ఆరోగ్య బీమా ప్రీమియం రూ.1.2 లక్షల కోట్లు



దేశంలో ఆరోగ్య బీమాపై అవగాహన.. అందుకనుగుణంగా పాలసీల కవరేజీ పెరుగుతోంది. 2024 25లో మొత్తం ఆరోగ్య బీమా ప్రీమియం విలువ రూ.1.2 లక్షల కోట్లను అధిగమించింది. 2023 24 ప్రీమియం కంటే ఇది 9% అధికం. ఆరోగ్య పరిరక్షణ కోసం తప్పనిసరిగా మెరుగైన చికిత్స పొందాలనే ధోరణి ప్రజల్లో పెరుగుతోంది. దీనికితోడు వైద్య ఖర్చులు అధికమవుతుండటంతో, బీమా తీసుకోవడానికి అధికులు ముందుకు వస్తున్నారని ఆర్థిక శాఖ తెలిపింది. పాలసీదారులకు సకాలంలో మద్దతు అందేలా చూసేందుకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ).. నగదు రహిత ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ కోసం, కంపెనీలకు నిర్దిష్ట కాల పరిమితులను నిర్దేశించింది. నగదు రహిత ప్రీఆథరైజేషన్‌ను ఒక గంటలోగా, తుది ఆథరైజేషన్‌ను మూడు గంటల్లోగా ఆమోదించాలి. పాలసీదారుల వయసు పెరగడం, అధిక కవరేజీ, మెరుగైన సదుపాయాల వల్ల ఆరోగ్య బీమా ప్రీమియం పెరుగుతోందని వివరించింది. ఐఆర్‌డీఏఐ 2024 నిబంధనలు.. అన్ని సంబంధిత ప్రమాద కారకాల ఆధారంగా బీమా ఉత్పత్తులకు న్యాయబద్ధంగా ధరలు నిర్ణయించాలని, అవి ఆచరణీయంగా, విలువ ఆధారితంగా కొనసాగాలని నిర్దేశిస్తున్నాయి. విశ్వసనీయ గణాంకాలు, వినియోగదారు అభిప్రాయం ఆధారంగా క్రమానుగత సమీక్షలు జరగాలని సూచిస్తున్నాయి. ఐఆర్‌డీఏఐ బీమా భరోసా పోర్టల్ ప్రకారం, 202425లో 1,37,361 సాధారణ, ఆరోగ్య బీమా ఫిర్యాదులు నమోదు కాగా, అందులో 1,27,755 (93%) పరిష్కారమయ్యాయి. క్లెయిమ్‌ల తిరస్కరణ లేదా నిరాకరణకు గల కారణాలు చాలా వరకు నిర్దిష్ట పాలసీ షరతులు, పరిమితులేనని పేర్కొంది. బీమా మొత్తాన్ని క్లెయిమ్ మించడం, కోపేమెంట్ నిబంధన, పాలసీలలో ఉప పరిమితులు, టాప్‌అప్ పాలసీల్లో మినహాయింపు, గది అద్దెపై పరిమితి, దామాషా ఛార్జీలు, వైద్యేతర ఖర్చుల వంటివి ఉన్నాయి. స్పష్టతను పెంచడానికి, క్లెయిమ్‌ల ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, పాలసీదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి ఐఆర్‌డీఏఐ అనేక చర్యలు తీసుకుందని ఆర్థిక శాఖ తెలిపింది.

# నిపుణుల కంటే ఏఐతో పని చౌక

- –వ్యక్తిగత సమాచారాన్ని ఏఐ ఏజెంట్లకు ఇవ్వొద్దు
- –ప్రస్తుతం భద్రమైన వ్యవస్థ లేదు
- –బోధనా పద్ధతులు మారాలి
- –విద్యార్థులు టూల్స్‌పై ఎక్కువగా ఆధారపడొద్దు
- –ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్




నిపుణులతో పోలిస్తే, కృత్రిమ మేధ(ఏఐ)తో మేధోపరమైన పనులు చౌకగా నిర్వహించుకునేలా అడుగులు పడుతున్నాయని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. 'ఇన్‌ఫరెన్స్' దశలో ఉన్న ఏఐ మోడళ్లను పనిచేయించే విషయంలో.. నిపుణుల వ్యయాల కంటే తక్కువ ఖర్చుతో, వారికి సమానమైన మేధోశక్తితో ఏఐ చేయగలుగుతోందని ఫోర్బ్స్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో బోధనా పద్ధతులు మారకపోతే, విద్యార్థులు ఏఐ టూల్స్‌పై అధికంగా ఆధారపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**ఖర్చు తక్కువే..**ఏఐకయ్యే శిక్షణ ఖర్చులు, మనుషుల సామర్థ్యం మధ్య పోలికల విషయానికొస్తే.. మానవ మేధకు దశాబ్దాల పాటు బయోలాజికల్ 'శిక్షణ', జీవితకాలం పాటు శక్తి వినియోగం అవసరం. మేధో ఫలితాలను ఒక్కో యూనిట్ ఆధారంగా చూస్తే.. ఏఐ వ్యవస్థలు మెరుగ్గా మారుతున్నాయి. సామర్థ్యం మరింత పెరిగే అవకాశాలూ కనిపిస్తున్నాయి. ఒక్కో పని చొప్పున చూసినా ఏఐ చౌకగానే ఉంటోంది.

**ఉద్యోగాల తీరే మారుతుంది...**ఏఐ వల్ల ఉద్యోగాలు పోవు. నిపుణులు చేసే పని మారుతుంది. ఉద్యోగాలపై ఏఐ చూపే ప్రభావంలో ఏకరూపత ఉండకపోవచ్చు. కొన్ని ఉద్యోగాల్లో పాక్షిక ఆటోమేషన్ కనిపించొచ్చు. మరికొన్ని పూర్తిగా మారిపోవచ్చు. సరికొత్త ఉద్యోగాలూ రావచ్చు. యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లు ఇటీవలి వరకూ లేరు.. ఇపుడు ఎక్కువ మంది యువత ఆ బాట పడుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. ఉద్యోగం విషయంలో సవాళ్లను ఎదుర్కోవాలంటే, ఇప్పటి నుంచి దశాబ్దం తర్వాత ఎటువంటి నైపుణ్యాలు అవసరమో అంచనా వేయడం ముఖ్యం.

**కోడింగ్ ముఖ్యం కాదు ...**ఒకప్పుడు కోడింగ్ అందరికీ అవసరమైన నైపుణ్యం. ఇపుడు ఏఐ టూల్స్‌ను అందిపుచ్చుకోవడం కీలకంగా మారింది. మనకు ఇపుడు నైపుణ్యం అడ్డంకిగా లేదు. వనరులే ముఖ్యం. అందుకే దేశాలు ఏఐ మౌలిక వసతులను స్థానికంగా అభివృద్ధి చేసుకోవాలా, లేదా బయటి ప్రొవైడర్లపై ఆధారపడాలా అన్నది నిర్ణయించుకోవాలి.

**విద్యా వ్యవస్థ మారాలి..**సాంకేతికతలో మార్పులు రావడం అసలైన సవాలు కాదు. విద్యా వ్యవస్థలు వాటిని అందుపుచ్చుకోవడమే సిసలు సవాలు. బోధనా పద్ధతుల్లో మార్పు రాకపోతే, విద్యార్థులు ఏఐ టూల్స్‌పైనే అధికంగా ఆధారపడే అవకాశం ఉంది. ఏఐ టూల్స్ అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని గుర్తుంచుకుని, అభ్యాస వ్యవస్థలను విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సమస్యపరిష్కారాలతో రీడిజైన్ చేయాలి.

**భారత్ అత్యంత డైనమిక్ మార్కెట్.....**ఏఐని అందిపుచ్చుకునే విషయంలో భారత్ అత్యంత క్రియాశీలక మార్కెట్‌గా ఉంది. మౌలిక వసతుల నుంచి అప్లికేషన్ల వరకు.. ఇలా పూర్తి స్టాక్‌పై పెట్టుబడులు పెడుతోంది. ఓపెన్‌ఏఐ కోడింగ్ ప్రోడక్ట్‌కు భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌గా ఉంది. త్వరలో అతిపెద్ద మార్కెట్‌గానూ మారొచ్చు. సంప్రదాయ ఇంటర్నెట్ సేవలతో పోలిస్తే ఏఐ సేవలను అందించడం చాలా ఖరీదైన వ్యవహారం. అందుకే కంపెనీలు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవడం ముఖ్యం. భారత్ వంటి మార్కెట్లను అవి కనుగొనాలి.




**భద్రత, గోప్యత కీలకం...**ఏఐ ఆధారిత వ్యక్తిగత ఏజెంట్లను మరింతగా అందిపుచ్చుకోవడానికి భద్రత, గోప్యత.. అతిపెద్ద సమస్యలుగా ఉన్నాయి. సునిశిత వ్యక్తిగత సమాచారం విషయంలో ప్రస్తుత వ్యవస్థలు అంత నమ్మదగినవి కావు. అందువల్ల వాటికి సమాచారం ఇచ్చే ముందు జాగ్రత్తగా ఉండాలి. ఒక్కసారి భద్రమైన వ్యవస్థలు వచ్చాక, అటువంటి ఏజెంట్లను అందిపుచ్చుకోవడం వేగంగా పెరుగుతుంది.

# ఇరాన్ గ్యాస్ కొనుగోలు చేసిన ఐఓసీ




పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీ సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, ధరలు పెరుగుతున్నందున, గతంలో ఇరాన్‌పై విధించిన ఆంక్షలను అమెరికా తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలోనే మన ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), దాదాపు 8 ఏళ్ల విరామం తర్వాత ఇరాన్ నుంచి గ్యాస్ (ఎల్‌పీజీ)ని కొనుగోలు చేసింది. దాదాపు 43,000 టన్నుల గ్యాస్‌ను బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌తో ఐఓసీ పంచుకోనుంది. ఇది మన దేశంలో సగం రోజు డిమాండ్‌కు మాత్రమే సరిపోతుంది. సరఫరా అంతరాయాల నేపథ్యంలో, దేశీయంగా ఇళ్లలో వినియోగించే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ కాలవ్యవధిని కంపెనీలు పెంచాయి. వాణిజ్య సిలిండర్లు 50% మాత్రమే సరఫరా అవుతున్నాయి. అందువల్ల వీలైనన్ని దేశాల నుంచి గ్యాస్ దిగుమతి చేసుకునేందుకు మనదేశం ప్రయత్నిస్తోంది. డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ ప్రకారం.. ఐఓసీ చివరిసారిగా 2018 జూన్‌లో ఇరాన్ నుంచి ఎల్‌పీజీని కొనుగోలు చేసింది. ప్రస్తుతం కొనుగోలు చేసిన వాటిలో 43,000 టన్నుల బ్యూటెన్, ప్రొపేన్ ఉన్నాయి. సీ బర్డ్ అనే ఎల్‌పీజీ వాహక నౌక ఇరాన్ నుంచి ఈ సరకును తీసుకుని మంగళూరు పోర్టుకు చేరుకోనుంది. గ్రీన్ ఆశా, గ్రీన్ శాన్వి నౌకల సురక్షిత ప్రయాణం కోసం చర్చలు జరుగుతున్నాయి. మన దేశ ఎల్‌పీజీ అవసరాల్లో మూడింట రెండొంతులు దిగుమతులే తీరుస్తున్నాయి. ఇందులో 90% పశ్చిమాసియా, హర్మూజ్ జలసంధి ద్వారానే వస్తుంది. యుద్ధం వల్ల ఈ మార్గంలో ఏర్పడుతున్న అవాంతరాల వల్లే దేశీయంగా కొరత ఏర్పడింది.

**ఇరాన్ చమురు కొనలేదు: రిలయన్స్ ఇండస్ట్రీస్**

ఇరాన్ నుంచి ముడిచమురును తాము కొనుగోలు చేసినట్లు వచ్చిన వార్తలను రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ఖండించింది. అమెరికా ఆంక్షలు తొలగించిన వెంటనే రిలయన్స్ 5 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురును కొనుగోలు చేసిందని వార్తాసంస్థ రాయిటర్స్ ప్రచురించిన కథనంపై, రిలయన్స్ ఈ విధంగా స్పందించింది. 'ఇరాన్ ముడిచమురును కొనుగోలు చేశామంటూ వచ్చిన వార్తలు ఆధారరహితమైనవి, తప్పుదోవ పట్టించేవి' అని రిలయన్స్ ప్రకటనలో పేర్కొంది.

## ట్యాబ్లెట్ పీసీల్లో శామ్‌సంగ్ జోరు

### కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక



దేశంలో ట్యాబ్లెట్ పీసీ మార్కెట్, గతేడాది వార్షిక ప్రాతిపదికన 2% వృద్ధి చెందింది. ఈ విభాగంలో శామ్‌సంగ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, యాపిల్, ఏసర్ సరఫరాలు తగాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తాజా నివేదికలో పేర్కొంది. భారత ట్యాబ్లెట్ మార్కెట్, ప్రీమియం ఉత్పత్తుల వైపు మళ్లుతోందని, అధిక పనితీరు కలిగిన వాటికి వినియోగదారులు మొగ్గుచూపుతున్నారని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రిన్సిపల్ అనలిస్ట్ అన్షికా జైన్ తెలిపారు. రూ.30,00040,000 ధర కలిగిన ట్యాబ్లెట్ల విభాగం అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని, ఈ విభాగం సరఫరాలు దాదాపు 7 రెట్లు పెరిగినట్లు వెల్లడించారు. భారత్‌లో శామ్‌సంగ్ ట్యాబ్లెట్ పీసీ సరఫరాలు 15% పెరిగాయి. శామ్‌సంగ్ మార్కెట్ వాటా 2024లో 27% కాగా, 2025లో 31 శాతానికి పెరిగింది. గెలాక్సీ ట్యాబ్ ఏ9, ఏ11 సిరీస్‌లు ఈ వృద్ధికి దోహదపడ్డాయి. గెలాక్సీ ట్యాబ్ ఎస్ పోర్ట్‌ఫోలియోతో రూ.15,00030,000 విభాగంలో కంపెనీ ఆధిపత్యం చెలాయించింది. 20% మార్కెట్ వాటాతో యాపిల్ రెండో స్థానంలో నిలిచింది. కంపెనీ సరఫరాలు గతేడాది 2% తగ్గాయి. లెనోవో 15% వాటాతో 24% వృద్ధిని, షియామీ 11% వాటాతో 74% వృద్ధి సాధించాయి. ఏసర్ మార్కెట్ వాటా 21% నుంచి 10 శాతానికి పడిపోయింది.10 లక్షల ఎగుమతులు: భారత ట్యాబ్లెట్ల తయారీ రంగానికి 2025 ఒక మలుపుగా నిలిచింది. గతంతో నామమాత్రంగా ఉన్న ఎగుమతులు, 2025లో 10 లక్షల యూనిట్లను మించాయి. ఎగుమతుల్లో శామ్‌సంగ్, లెనోవో అగ్రస్థానాల్లో ఉన్నాయి. మన దేశం నుంచి అమెరికా, ఐరోపా మార్కెట్లకు ఎక్కువ ఎగుమతులు వెళ్లాయి. వార్షిక సరఫరాల్లో 50% దేశీయంగానే ఉత్పత్తి అయ్యాయి. ఇది దేశీయ తయారీ సామర్థ్యాలు పెరగడానికి నిదర్శనం అని నివేదిక వెల్లడించింది.

**భవిష్యత్ అంచనాలు...**2026లో కూడా భారత ట్యాబ్లెట్ విపణి బలమైన వృద్ధిని కొనసాగించే అవకాశం ఉందని కౌంటర్‌పాయింట్ అంచనా వేస్తోంది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఫీచర్లు ఉన్న ట్యాబ్లెట్లు వినియోగదారులను ఆకట్టుకుంటాయని, భారత్ ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా మరింత బలోపేతం కానుందని నివేదిక పేర్కొంది.

# విమాన సంస్థలకు త్వరలో మంచి రోజులు: డీజీసీఏ




విమానయాన సంస్థలు సులభంగా వ్యాపారం చేసుకునేందుకు, అవి వృద్ధి చెందేందుకు తగిన మద్దతు ఇస్తున్నామని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పేర్కొంది. ప్రయాణికుల హక్కుల పరిరక్షణకూ తగిన చర్యలు తీసుకుంటున్నామని డీజీసీఏ అధిపతి ఫయాజ్ అహ్మద్ కిద్వాయ్ పేర్కొన్నారు. యుద్ధాల కారణంగా కొన్ని దేశాలు గగనతల ఆంక్షలు విధించడంతో, అంతర్జాతీయ మార్గాల్లో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావడం, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరతో పాటు కార్యకలాపాల వ్యయాలు పెరగడం వంటి సవాళ్లను విమానయాన కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్నాయన్నారు. త్వరలో మంచి రోజులు రావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత పౌర విమానయాన మార్కెట్ వృద్ధి కోసం డీజీసీఏ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పలు చర్యలు తీసుకుంటున్నాయి. డిసెంబరులో ఇండిగో విమాన కార్యకలాపాలకు పెద్దఎత్తున అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో, ఇతర సంస్థల విమాన టికెట్ల ధరలు మరీ పెరగకుండా విధించిన గరిష్ఠ పరిమితి ఆంక్షలను ఇటీవల సంస్థ తొలగించింది కూడా.

**ఎయిరిండియా అధికారిపై చర్యలు:** గత వారం వాంకోవర్ (కెనడా)కు అనుమతి ఉన్న విమానం బదులు ఇంకొక విమానాన్ని పంపిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎయిరిండియాకు డీజీసీఏ సూచించింది. ఇందుకు బాధ్యుడైన అధికారిపై చర్యలు తీసుకుంది. వాంకోవర్‌కు బోయింగ్ 777300 ఈఆర్ మోడల్ విమానానికి అనుమతులుండగా, బోయింగ్ 777200 ఎల్ఆర్ విమానాన్ని పంపింది. కెనడా అధికారులు అనుమతి నిరాకరించడంతో.. 7 గంటల ప్రయాణం తర్వాత దిల్లీకి విమానం తిరిగొచ్చిన సంగతి తెలిసిందే.

## నయారా ఎనర్జీ పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

దేశంలో అతిపెద్ద ప్రైవేట్ ఇంధన రిటెయిలర్ నయారా ఎనర్జీ, పెట్రోల్ ధరను లీటర్‌కు రూ.5, డీజిల్ ధరను రూ.3 మేర పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. స్థానిక పన్నుల ఆధారంగా ఈ పెంపు రాష్ట్రాల వారీగా మారుతుంది. కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ ధర లీటరుకు రూ.5.30 వరకు ప్రియం కానుంది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు ప్రారంభించాక, ఇప్పటివరకు అంతర్జాతీయంగా చమురు ధర దాదాపు 50% పెరిగింది. అయినా దేశంలో పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు సవరించలేదు. దేశంలో మొత్తం 1,02,075 పెట్రోల్ బంకులు ఉండగా, 90,000 వరకు ప్రభుత్వరంగ సంస్థలే నిర్వహిస్తున్నాయి. ఇవి పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను సవరించనందున, ప్రైవేటు సంస్థలూ మిన్నకుండిపోయాయి. ఫలితంగా చమురు విక్రయ సంస్థలన్నీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. పెరిగిన ఖర్చుల్లో కొంత భాగాన్ని వినియోగదారులకు బదలాయించాలని ఇప్పుడు నయారా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వరంగ సంస్థల మాదిరిగా ప్రైవేట్ కంపెనీలకు పరిహారం అందనందునే, రిటెయిల్ ధరలను నయారా సవరించిందని సమాచారం. నయారా ఎనర్జీకి దేశంలో 6,967 బంకులు ఉన్నాయి. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్‌కు చెందిన బీపీ సంయుక్త సంస్థ జియోబీపీ ఇప్పటివరకు ధరలు సవరించలేదు. గత వారం ప్రీమియం పెట్రోల్ ధరను లీటరుకు రూ.2, పారిశ్రామిక అవసరాల కోసం వాడే బల్క్ డీజిల్ ధరను లీటరుకు రూ.22 మేర ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ పెంచాయి. కానీ సాధారణ పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరల్లో మార్పులు చేయలేదు.

## మరో 5 లక్షలకు పైగా ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా



రెండు విడతల్లో 5 లక్షల ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా కోసం కొత్తగా టెండర్లు పిలిచే యోచనలో ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఉన్నట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరాపై ప్రభావం పడటంతో విద్యుత్తు సాయంతో వంట చేసుకునే ఉపకరణాలకు గిరాకీ పెరిగింది. గిరాకీకి తగ్గట్లుగా సరఫరా పెంచేందుకు ఇటీవలే లక్ష ఇండక్షన్ స్టవ్‌లకు టెండర్ ప్రక్రియను ఈఈఎస్ఎల్ పూర్తి చేసింది. పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, వినియోగదారుల అభిప్రాయాలు సేకరించి, ఇండక్షన్ ఆధారిత వంట సామగ్రికీ టెండర్ ప్రక్రియను నిర్వహించింది. 'ప్రస్తుతం మార్కెట్లో వినియోగదార్ల నుంచి వస్తున్న అధిక స్పందనను దృష్టిలో ఉంచుకుని, దాదాపు 5 లక్షల ఇండక్షన్ స్టవ్‌లకు కొత్తగా టెండర్లు ఆహ్వానించాలని ఈఈఎస్ఎల్ భావిస్తోంద'ని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## ఏం చేస్తుంటావు..? అని అడిగితే, 'ఓజీ అసిస్టెంట్ డైరెక్టర్' అని చెప్పా..: తిరువీర్



పాపం ప్రతాప్' (Papam Prathap) మంచి థియేట్రికల్ అనుభూతిని ఇస్తుందని, ఎక్కడా అసభ్యతకు తావు లేకుండా కుటుంబమంతా కలిసి చూడొచ్చని అన్నారు తిరువీర్ (Thiruveer). ఆయన కథానాయకుడిగా దుర్గా నరేశ్ దర్శకత్వంలో రూపొందిన విలేజ్ డ్రామా ఇది. రాశీ, అజయ్‌ఘోష్, పాయల రాధాకృష్ణ, దేవి ప్రసాద్ కీలక పాత్రల్లో నటించారు. గడ్డం రాకేశ్‌రెడ్డి, రుద్రదేవ్ మదిరెడ్డి నిర్మాతలు. ఈటీవీ విన్ ఒరిజినల్స్, క్రిష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందింది. ఇప్పటికే చిత్రీకరణపూర్తి చేసుకున్న 'పాపం ప్రతాప్' ఏప్రిల్ 17న (papam prathap movie release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం విలేకరులతో మాట్లాడింది.

కథానాయకుడు తిరువీర్ మాట్లాడుతూ.. ''ఈటీవీ విన్ తీసిన 'వీరాంజనేయులు విహారయాత్ర' నేనే చేయాల్సింది. కానీ, చేయలేకపోయా. ఇప్పుడు 'పాపం ప్రతాప్' ఈటీవీ విన్‌నుంచి వస్తున్నందుకు గర్వంగా ఉంది. దర్శకుడు నరేశ్ ఈ కథ 2021లోనే చెప్పాడు. అతడి కోసమే ఈ సినిమా చేశా. మొదటిసారి యాక్షన్ నుంచి కమర్షియల్ స్పేస్‌కు వచ్చాను. ఇకపై తిరువీర్ సినిమాలు థియేటర్‌లోనూ అలరిస్తాయని నమ్మకంతో ఉన్నాను. కుటుంబంతో సహా చూసే సినిమా ఇది. ఎక్కడా అసభ్యత ఉండదు. కమర్షియల్ ఫార్ములాతో నడిచే కథలు ఎంపిక చేసుకునే సౌకర్యం నాకు ఇంకా రాలేదు. ఉన్నవాటిలో మంచి వాటిని ఎంపిక చేసుకుని చేస్తున్నా. 'వీడు ఊరి దాటి బయటకు రాడా?' అని ఒకరు కామెంట్ చేశారు. బయటకు రావాలని నాకూ ఉంది. కానీ, కథ నచ్చాలి కదా''
'



## అందుకే 'జెంటిల్‌మేన్'లో నటించలేకపోయా: రాజశేఖర్

ఓ హీరోని దృష్టిలో పెట్టుకుని కథ సిద్ధం చేసుకుని.. పలు కారణాల వల్ల వేరే హీరోతో మేకర్స్ సినిమా చేయడం ఇండస్ట్రీలో సాధారణం. కానీ, ఏ నటుడి స్థానంలో ఏ కథానాయకుడు నటించాడన్నది మాత్రం ప్రేక్షకులకు ఆసక్తికరం. హిట్ మూవీ విషయంలో అది ఇంకాస్త ఎక్కువ. అలాంటి సినిమాల్లో 'జెంటిల్‌మేన్' (Gentleman) ఒకటి. అర్జున్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రంలో ముందుగా రాజశేఖర్‌ను అనుకున్నారన్న సంగతి సినీ అభిమానులకు తెలిసే ఉండొచ్చు. కానీ, ఎందుకు వదులుకున్నారంటే స్పష్టత ఉండదు. దీనిపై రాజశేఖరే స్వయంగా (Rajashekhar) స్పందించారు. తానెందుకు ఈ చిత్రం చేయలేకపోవడానికి గల కారణాన్ని చెప్పారు.

''జెంటిల్‌మేన్' సినిమా నేనే చేయాల్సింది. కానీ, కుదరలేదు. ఎందుకంటే అదే సమయంలో 'అల్లరి ప్రియుడు' సినిమాకు నా డేట్స్ ఫిక్స్ అయి ఉన్నాయి. రెండింటిలో ఏది? అని తేల్చుకోవాల్సి రాగా నేను 'అల్లరి ప్రియుడు' చేశా'' అని వివరించారు. తన కన్నా ముందు ఈ సినిమాలో హీరోగా శరత్‌కుమార్‌ని అనుకున్నారని తెలిపారు.


కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు శంకర్ తెరకెక్కించిన తొలి చిత్రమే 'జెంటిల్‌మేన్'. ధనికుల నుంచి డబ్బు దోచుకుని.. దానిని పేదలకు పంచే కృష్ణమూర్తి అనే యువకుడి కథ ఇది. విద్యావ్యవస్థ ఇతివృత్తంగా ఈ రాబిన్‌హుడ్ కథను తెరకెక్కించారు. మధుబాల, శుభాశ్రీ హీరోయిన్లు. తమిళనాట 175 రోజులకుపైగా ప్రదర్శితమైన ఈ సినిమాకి పలు అవార్డులూ దక్కాయి.

ప్రస్తుతం సపోర్టింగ్ రోల్స్ చేస్తున్న రాజశేఖర్ నటించిన కొత్త సినిమా 'బైకర్' (Biker). శర్వానంద్ హీరోగా అభిలాష్ రెడ్డి తెరకెక్కించారు. ఇందులో హీరో తండ్రిగా కనిపించనున్నారు రాజశేఖర్. ఈ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది.

### అనిల్ రావిపూడి చిత్రం..

# మరో నాయికగా కృతిశెట్టి?

వచ్చే సంక్రాంతి లక్ష్యంగా ఓ మల్టీస్టారర్ సినిమా సిద్ధమవుతోంది. సంక్రాంతి సినిమాల దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించనున్నారు. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా నటించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులతోపాటు, నటీనటుల ఎంపిక జరుగుతోంది. ఇందులో కథానాయికలుగా నటించేది ఎవరన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఓ కథానాయిక పాత్ర కోసం చిత్రబృందం ఇటీవల కీర్తి సురేశ్‌ని సంప్రదించినట్టు తెలిసింది. తాజాగా మరో పాత్ర విషయంలో కృతిశెట్టి పేరు వినిపిస్తోంది. ఈ వేసవిలోనే పట్టాలెక్కనున్న ఈ సినిమాలో పూర్తిస్థాయి తారాగణంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఈ సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' తర్వాత అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రమిది.



## రామ్ చరణ్ కంటికి సర్జరీ.. చిరు పోస్ట్

రామ్ చరణ్ 'పెద్ది' షూటింగ్‌లో గాయపడిన విషయం తెలిసిందే. ఆయన కంటికి చిన్న సర్జరీ జరిగినట్లు చిరంజీవి సోషల్ మీడియాలో వెల్లడించారు. చరణ్‌కు సర్జరీ చేసిన వైద్యులకు ఆయన (Chiranjeevi) ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సర్జరీ గురించి చిరంజీవి స్పందిస్తూ.. ''చరణ్ కనురెప్పకు మీరు సరైన సమయంలో, ఎంతో నైపుణ్యంతో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. మొదట మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ, మీ మాటలు భయాన్ని పోగొట్టి ధైర్యాన్నిచ్చాయి'' అని పేర్కొన్నారు. చికిత్స అందించిన వైద్యులకు తమ కుటుంబం ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ వార్త తెలుసుకున్న అభిమానులు రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు (Ram



## 'ఆపరేషన్ సిందూర్' మూవీ.. దర్శకుడు ఎవరంటే!




భారత చలనచిత్ర పరిశ్రమలో మరో భారీ ప్రాజెక్టుకు అడుగులు పడ్డాయి. దేశభక్తి చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి, ప్రముఖ నిర్మాణసంస్థ టీసిరీస్ అధినేత భూషణ్ కుమార్ చేతులు కలిపారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'ఆపరేషన్ సిందూర్' (Operation Sindoor) అనే సినిమా తెరకెక్కనున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. భారత సైన్యం చేసిన సాహసాలను ఇందులో చూపించనున్నారు.

కథా నేపథ్యం విషయానికి వస్తే.. 2025లో పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఘోర మారణకాండకు ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన సైనిక చర్యల ఆధారంగా రూపొందుతోంది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (PoK) భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై భారత ఆర్మీ జరిపిన మెరుపు దాడులను ఈ చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపించనున్నారు. పహల్గాం ఘటన, మన సైనికుల ధైర్య సాహసాలను తెలియజేసేలా ఈ సినిమా ఉండనుంది.

రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కె.జె.ఎస్. 'టైనీ' ధిల్లాన్ రాసిన 'ఆపరేషన్ సిందూర్' (Operation Sindoor: The Untold Story of India's Deep Strikes Inside Pakistan) అనే పుస్తకం ఆధారంగా దీన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. గతంలోనూ ఈ పేరుతో బాలీవుడ్ ఒక ప్రాజెక్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సినిమా తీయనున్నట్లు దర్శకుడు ఉత్తమ్ మహేశ్వరీ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు.



## బావ గారు కాదు..

## చిరు నా అన్నయ్యే: పవన్ సతీమణి పోస్ట్



పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా ఇన్‌స్టాలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె చిరంజీవి, నాగబాబులతో తన అనుబంధాన్ని పంచుకుంటూ పెట్టిన ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. 'అన్నయ్యనా.. బావగారా?' అంటూ వారిద్దరితో దిగిన ఫొటోలను పంచుకున్నారు. ''ఒకరిపై ఒకరు ఎప్పుడూ ప్రేమానురాగాలు చూపిస్తూ ఉండే ఈ మెగా కుటుంబంలోకి దాదాపు 15 ఏళ్ల క్రితం అడుగుపెట్టాను. వచ్చిన కొత్తల్లో ఇక్కడ ఎలా ఉండాలో.. ఎవరిని ఎలా పిలవాలో అర్థంకాలేదు. దీంతో నా భర్త (Pawan Kalyan) వాళ్లను ఎలా పిలుస్తున్నారో గమనించి.. నేను అలానే పిలిచేదాన్ని. చిరంజీవిని అన్నయ్య అని, నాగబాబుని చిన్నన్నయ్య అని అనేదాన్ని. మొదట మామూలుగా అన్నయ్య అని పిలిచా.. కానీ, ఆ తర్వాతే ఆ బంధం గొప్పతనం అర్థమైంది. తర్వాత నేను (Anna Lezhneva) బావగారు అని పిలవడం నేర్చుకొన్నా. నాకు సోదరులు లేరు.. కానీ, ఈ బంధం నాకు చిరంజీవి (Chiranjeevi), నాగబాబుల రూపంలో ఇద్దరు సోదరులను ఇచ్చింది'' అని చెప్పారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. గంట కూడా కాకముందే లక్షకు పైగా లైక్‌లు వచ్చాయి. ఇక బుధవారం ఆమె (Anna Konidala) ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేయగా.. 24 గంటలు కూడా కాకముందే 2లక్షల40 వేల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. ఎంతోకాలంగా ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేయాలని అనుకుంటున్నానని.. ఇప్పుడు సరైన సమయం వచ్చిందని అందుకే ఓపెన్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

### ఆ కోటలో బ్రహ్మ రాక్షసుడు



ఏప్రిల్ తొలి వారంలో పలు ఆసక్తికరమైన సినిమాలు రానున్నాయి. అందులో ఒకటి... 'రాకాస'. విజయవంతమైన 'కమిటీ కుర్రోళ్ళు' తర్వాత నిహారిక నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ నుంచి వస్తున్న చిత్రమిది. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేశ్‌కుమార్ బన్సాల్‌తో కలిసి నిర్మిస్తున్నారు. సంగీత్‌శోభన్, నయన్‌సారిక జంటగా నటించారు. మానస శర్మ దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ని బుధవారం విడుదల చేసింది చిత్రబృందం. 'ఆ కోటలో ఉన్నది... ఊరు బలి పంపుతున్నది సామాన్యుడికి కాదు... భీకర బ్రహ్మ రాక్షసుడికి...' అనే సంభాషణతో మొదలైన ట్రైలర్‌లో ఫాంటసీ, ఫన్ అంశాలు సినిమాపై అంచనాల్ని పెంచుతున్నాయి. వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రాజు ఎదురురోలు, సంగీతం: అనుదీప్ దేవ్.

### ఉస్తాద్ భగత్ సింగ్'.. పవన్ కల్యాణ్

## ఎంట్రీ సీన్‌పై దర్శకుడి స్పందన

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' (Ustaad Bhagat Singh). ఈ సినిమాలో పవన్ ఎంట్రీ సీన్‌పై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోల్స్‌పై హరీశ్ శంకర్ స్పందించారు. ఆయన జీప్‌లో నుంచి రెండుసార్లు దిగడం ఒకే సీన్‌లో చూపించారని కొందరు విమర్శించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ తనకు రెండు ఎంట్రీలు నచ్చాయని అందుకే పెట్టినట్లు తెలిపారు.

**లాజిక్‌లు పట్టించుకోను..**

కొన్నికొన్ని సన్నివేశాల్లో స్వేచ్ఛ తీసుకుంటా. ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ (Pawan Kalyan) ఫస్ట్ జీప్‌లో నుంచి దిగుతారు. ఆ సమయంలో ఒక బాడీ పడుతుంటే ఆయన దిగడం చూపించా. ఆ తర్వాత మళ్లీ జీప్ నుంచి జంప్ చేస్తూ కిందకు వస్తారు. ఇదేంటి రెండుసార్లు ఎలా దిగారని కొందరు అన్నారు. అలాంటివి పట్టించుకోను. నాకు రెండు షాట్లూ నచ్చాయి. నేను ఒక షాట్ తీశా. మాస్టర్ ఇంకోటి తీశారు. రెండూ బాగున్నాయి అనిపించింది. నచ్చాయి అంటే లాజిక్‌లను పట్టించుకోను.

**'ధురంధర్ 2' కలెక్షన్స్ నాకూ సంతోషమే..**

'ధురంధర్ 2' కలెక్షన్స్ చూసి నాకు (Harish Shankar) కూడా ఆనందంగానే ఉంది. మీరు గమనిస్తే.. నేను ఉస్తాద్‌లో చూపించిన దేశభక్తిని ఆదిత్యధర్ పూర్తిస్థాయిలో 'ధురంధర్ 2'లో చూపించారు. నా భావాలతో నాకు నచ్చిన సినిమా.. నా చిత్రం కంటే బాగా హిట్ అవుతోంది అన్నప్పుడు ఒకరకమైన ఆనందం ఉంటుంది కదా.. నేను ఇప్పుడు అదే సంతోషంలో ఉన్నాను. మనమందరం సినిమా లవర్స్. ఏ సినిమా విజయం సాధించినా ఆనందమే.

**ఇకపై అలా కాదు..**

ఇన్నేళ్ల నా కెరీర్‌లో చాలా తక్కువ సినిమాలు చేశాను. నేను తొమ్మిది సినిమాలు చేస్తే.. దాదాపు 10 చిత్రాలు క్యాన్సిల్ చేశా. దానికి ఎన్నో కారణాలు




ఉన్నాయి. స్క్రిప్ట్ కుదరకపోవడం, హీరో చివరి నిమిషంలో క్యాన్సిల్ చేయడం.. ఇలా ఎన్నో ప్రాజెక్ట్‌లు చేయలేకపోయా. ఎన్టీఆర్‌తో 'ఎంఎల్‌ఏ' చేద్దాం అనుకున్నా. కానీ, కుదర్లేదు. క్యాన్సిల్ అయిన ప్రాజెక్ట్‌లకు వర్క్ చేసి కూడా పట్టాలెక్కించలేకపోయా. ఇకనుంచి అలా జరగదు. చాలా కథలు రాసుకున్నా. వరుసగా తెరకెక్కిస్తాను.

## టీమ్ఇండియా షెడ్యూల్.. హైదరాబాద్‌లో రెండు మ్యాచ్‌లు



దిల్లీ: 202627 సీజన్‌లో సొంతగడ్డపై జరిగే అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను గురువారం బీసీసీఐ ప్రకటించింది. రానున్న సీజన్‌లో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత్‌లో పర్యటించనున్నాయి. ఈ పర్యటనల్లో భారత్ 17 నగరాల్లో 22 మ్యాచ్‌లు ఆడనుంది. అందులో 5 టెస్టులు, 9 వన్డేలు, 8 టీ20లు ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది సెప్టెంబరు 27న వెస్టిండీస్ పర్యటనతో స్వదేశీ సీజన్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌లో మూడు వన్డేలు.. అయిదు టీ20ల్లో భారత్, విండీస్ తలపడతాయి.

అక్టోబరు 14న ఉప్పల్ స్టేడియంలో నాలుగో టీ20 జరగనుంది. మిగతా మ్యాచ్‌లకు వరుసగా త్రివేండ్రం, గువాహటి, చండీగఢ్, లఖ్‌నవూ, రాంచి, ఇండోర్, బెంగళూరు వేదికలుగా నిలవనున్నాయి. డిసెంబరు 13 నుంచి 27 వరకు శ్రీలంకతో మూడేసి వన్డేలు, టీ20లకు వరుసగా దిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్, రాజ్‌కోట్, కటక్, పుణె ఆతిథ్యమివ్వనున్నాయి.. 2027 జనవరి 3న మొదలయ్యే జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను వరుసగా కోల్‌కతా, హైదరాబాద్ (జనవరి 6న), ముంబయిలలో నిర్వహించనున్నారు. 2027 జనవరి 21న బోర్డర్ గావస్కర్ ట్రోఫీ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌లో అయిదు టెస్టు మ్యాచ్‌లకు నాగ్‌పుర్, చెన్నై, గువాహటి, రాంచి, అహ్మదాబాద్ వేదికలుగా నిలువనున్నాయి. గత కొంతకాలంగా కీలక మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తున్న విశాఖపట్నానికి 202627 సీజన్‌లో ఒక్కటి కూడా కేటాయించలేదు.

## స్వర్ణ పోరుకు చికిత ద్వయం




ఆసియాకప్ ప్రపంచ ర్యాంకింగ్ ఆర్చరీ స్టేజ్ 1 టోర్నమెంట్లో తెలంగాణ అమ్మాయి చికిత తానిపర్తి జోరు కొనసాగుతోంది. ఫైనల్ చేరిన కాంపౌండ్ మహిళల జట్టులో సభ్యురాలైన తెలుగమ్మాయి.. మిక్స్‌డ్ విభాగంలో రజత్ చౌహాన్ భాగస్వామిగా స్వర్ణ పోరుకు అర్హత సాధించింది. గురువారం సెమీఫైనల్లో చికితరజత్ జంట 157153తో విక్టోరియా లిన్‌బన్‌యాడ్ మిర్జామెటోవ్ (కజకిస్థాన్) జోడీని ఓడించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్‌లో రుమా బిస్వాస్‌దేవాంగ్ గుప్తా జంటకు చుక్కెదురైంది. క్వార్టర్స్‌లో రుమా జంట 26తో థియ్ డావోహొయాగ్ గుయెన్ (వియత్నాం) ద్వయం చేతిలో ఓడింది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ప్రథమేశ్, ఉదయ్ కాంభోజ్ ఫైనల్ చేరడంతో స్వర్ణం, రజతం భారత్‌కే ఖరారయ్యాయి. ప్రథమేశ్ 149148తో సహచరుడు రజత్ చౌహాన్‌పై నెగ్గగా.. ఉదయ్ 147145తో పిరావత్ (థాయ్‌లాండ్)ను ఓడించాడు. రజత్ కాంస్యం కోసం పోరాడనున్నాడు. మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో రిధి ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీస్‌లో జింగ్ లీ (మలేసియా)పై రిధి 60తో విజయం సాధించింది. మొత్తంగా ఈ టోర్నీలో మహిళల రికర్వ్ వ్యక్తిగత, పురుషుల రికర్వ్ టీమ్, మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్, పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగాల్లో భారత్ ఫైనల్ చేరింది. భారత్ ఇప్పటికే కాంపౌండ్ పురుషులు, మహిళల టీమ్ విభాగాల్లో కాంస్యాలు గెలిచింది

## బ్యాడ్మింటన్‌కు మారిన్ వీడ్కోలు



దిల్లీ: స్పెయిన్ బ్యాడ్మింటన్ దిగ్గజం కరోలినా మారిన్ ఆటకు వీడ్కోలు పలికింది. చాలా కాలంగా మోకాలి గాయంతో బాధపడుతున్న మారిన్ గురువారం రిటైర్‌మెంట్ ప్రకటించింది. "ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్‌లో నా ప్రయాణం ముగిసింది. హెలువాలో జరిగే ఐరోపా ఛాంపియన్‌షిప్‌లో బరిలో దిగట్లేదు. చివరగా నా తోటి షట్లర్లతో పోటీపడాలని అనుకున్నా. కానీ గాయం కారణంగా ఆ సాహసం చేయదలుచుకోలేదు" అని 32 ఏళ్ల మారిన్ సామాజిక మాధ్యమంలో పేర్కొంది.

2016 రియో ఒలింపిక్స్, 2018 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ పి.వి. సింధును ఓడించి మారిన్ విజేతగా నిలిచింది. దూకుడైన ఆటకు మారుపేరైన ఈ ఎడమచేతి వాటం షట్లర్.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో (2014, 2015, 2018)లో మూడు స్వర్ణాలు, ఒక రజతం (2023) గెలిచింది. ముఖ్యంగా సింధుతో మారిన్ పోరాటాలను అభిమానులు అంత తేలిగ్గా మరిచిపోలేరు. గాయాలతో బాధపడుతూనే కెరీర్‌ను కొనసాగించిన మారిన్.. ఆఖరిగా 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడినా.. పతకం సాధించలేకపోయింది.

# ఐపీఎల్ 2026.. పూర్తి షెడ్యూల్ వచ్చేసింది



ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. ఇంతకుముందు తొలి దశలో కేవలం 20 మ్యాచులకు మాత్రమే వేదికలు, తేదీలను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో దశలో 50 మ్యాచులకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో మొత్తం 70 లీగ్ మ్యాచులకూ షెడ్యూల్ ప్రకటించినట్లైంది. అయితే, ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. మార్చి 28 నుంచి మే 24 వరకూ జరగనున్న లీగ్ స్టేజ్ మ్యాచ్‌ల వివరాలను ప్రకటించింది. బెంగళూరు వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌తో 19వ ఎడిషన్ ప్రారంభం కానుంది. లీగ్ స్టేజ్ కోల్‌కతా నైట్‌రైడర్స్ vs దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో ముగియనుంది. ఈ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుంది.

**క్యాచులపై క్లారిటీ**

క్యాచుల విషయంపై ఇప్పటికే పది జట్ల సారథులకు బీసీసీఐ క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కెప్టెన్లతో జరిగిన సమావేశంలో అందుకు సంబంధించిన వీడియోలను ప్లే చేసి చూపించారని సమాచారం. క్లాజ్ 33.3 ప్రకారం బంతిపై ఫీల్డర్‌కు పూర్తి నియంత్రణ వచ్చినట్లు అంపైర్లు భావిస్తేనే ఔట్ ఇవ్వడం జరుగుతుందని బీసీసీఐ స్పష్టం చేసింది. అందుకోసం గత టీ20 ప్రపంచ కప్‌లో కాస్త చర్చకు దారితీసిన క్యాచుల వీడియోలను ప్రదర్శించింది.

# కేరళ స్టార్.. సీఎస్‌కేలో ఏం చేస్తాడు?

**ఇప్పుడు ఎక్కడ చూసినా సంజు.. సంజు అని ఒకటే జపం. తిరువనంతపురం వీధుల్లో క్రికెట్ నేర్చుకుని.. దిల్లీ, జైపుర్, కోల్‌కతా పర్యటించి.. దక్షిణాదిన అడుగు పెట్టాడు. తొలిసారి పసుపు దళంలోకి వచ్చి చేరాడు ఈ వరల్డ్ కప్ హీరో. అందుకే, ఇప్పుడందరి చూపు అతడిపైనే. ఈసారి ఏం చేస్తాడు? ఎలా అలరిస్తాడు? అని ఒకటే చర్చ.**



సీఎస్‌కే అంటే మహేంద్ర సింగ్ ధోని జట్టు. కెప్టెన్ ఎవరైనా ఆ జట్టు పేరు అంతే. అలానే పిలిపించుకోవడానికి ఆ టీమ్ కూడా ఇష్టపడుతుంది. ధోని తర్వాత అంత అభిమానం పొందిన ఆటగాళ్లు అంటే సురేశ్ రైనా, రవీంద్ర జడేజా మాత్రమే. ఇప్పుడిప్పుడు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఆ రేసులో ఉన్నాడు. అయితే ఇంకా జట్టు తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే సంజూ శాంసన్‌ని అక్కున చేర్చేసుకున్నారు సూపర్ కింగ్స్ సూపర్ ఫ్యాన్స్. ఒక్కసారి వారికి కనెక్ట్ అయితే బిరుదులు ఇచ్చి మరీ ముద్దుగా పిలుచుకుంటారు. ధోనికి 'తలా' అని.. రైనాకు 'చిన్న తలా' అని అలానే పేరు పెట్టారు. ఇప్పుడు సంజు శాంసన్ వంతు వచ్చింది. ఇటీవల ప్రపంచకప్ మ్యాచ్ కోసం చెన్నై వచ్చినప్పుడు మైదానంలో ఫ్యాన్స్ చేసిన హడావుడి మీరు చూసే ఉంటారు.

తమిళనాడు, కేరళ పక్కపక్కనే ఉన్న రాష్ట్రాలు. సీఎస్కేకి ఆడకపోయినప్పుడు కూడా చెపాక్ మైదానానికి సంజూ వచ్చినప్పుడు ధోని అండ్ టీమ్ తర్వాత అంత స్పందన సంజూకే వచ్చేది. అలాంటిది ఇప్పుడు అతను చెన్నైకే ఆడుతుండటం, తొలి సీజన్‌లో కచ్చితంగా రాణిస్తాడని విశ్లేషకులు చెబుతుండటం, రీసెంట్ ఫామ్ అన్నీ కలసి ఈ సీజన్‌లోనే అభిమానులు బిరుదు ఇచ్చేసేలా ఉన్నారు.

ఆ ఆఫర్‌ను కాదనలేదు..

సంజు శాంసన్ ఎప్పుడైతే రాజస్థాన్ రాయల్స్‌ను వదిలేయాలని నిర్ణయించుకున్నాడో అతడికి ఇతర ఫ్రాంచైజీల నుంచి మంచి ఆఫర్లే వచ్చాయి. సారథిని చేస్తామంటూ అవకాశాలూ వరించాయి. ఎప్పుడైతే చెన్నై నుంచి ఆఫర్ వచ్చిందో.. వెంటనే ఓకే చెప్పేశాడని సన్నిహితులు చెబుతారు. ఇక్కడ అతడికి కెప్టెన్సీ వస్తుందో లేదో కూడా చెప్పలేని పరిస్థితి. అప్పటికే రుతురాజ్ గైక్వాడ్ సారథిగా కొనసాగుతాడని ఫ్రాంచైజీ కూడా చెప్పేసింది. అయినా సరే అవేవీ పట్టించుకోని సంజు తనకిష్టమైన ధోనితో కలిసి ఆడే అవకాశం వదులుకోలేదు. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్ మేనియా ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. చెన్నైకి సంజు రావడానికి మరో కారణం రజనీపై ఇష్టం కూడా ఉందంటే అతిశయోక్తికాదు.

దుమ్మురేపితే..

దుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన సీఎస్‌కేకు గత సీజన్లలో పరిస్థితులు అనుకూలంగా లేవు. అయితే, డాడీస్ టీమ్ అంటూ ఒకసారి కప్పును నెగ్గిన ఆ జట్టు ఇప్పుడు యువరక్తంతో తాజాగా కనిపిస్తోంది. జట్టులో ఎంఎస్ ధోని కాకుండా.. శివమ్ దూబె (32), సంజు శాంసన్ (31) మాత్రమే సీనియర్లు. ఆరో కప్‌పై కన్నేసిన సీఎస్‌కే బాధ్యతను కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో కలసి శాంసన్ తీసుకోవాల్సి ఉంటుంది. ధోని లోయర్ ఆర్డర్‌లోనే వస్తూ దూకుడుగా ఆడుతున్నాడు. అతడు ఈసారి ఇంపాక్ట్ ప్లేయర్‌గా వస్తాడా.. మొత్తం ఆడతాడా? అనేది తేలాల్సి ఉంది.

ఇప్పటికే సంజును ఓపెనర్‌గా ఖరారు చేస్తూ మేనేజ్‌మెంట్ కూడా నిర్ణయం తీసుకుంది. అతడితోపాటు రుతురాజ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడు. టీ20 ప్రపంచ కప్‌లో ఆడినట్లు చెలరేగితే చాలు సీఎస్‌కేకు కప్ కొట్టడం కష్టమేం కాదనేది అభిమానుల అంచనా. ఐపీఎల్‌లోనూ సంజుకు మెరుగైన రికార్డులే ఉన్నాయి. పవర్‌ప్లేలో సంజును ఆపడం చాలా కష్టం. ఒక్కసారి కుదురుకుంటే వేగంగా పరుగులు వచ్చేస్తాయి. ఐపీఎల్ కెరీర్‌లో ఓవరాల్‌గా 177 మ్యాచులు ఆడిన సంజు 4,700కిపైగా పరుగులు చేశాడు. పొట్టి కప్ ఫామ్‌ను కొనసాగించి మరోసారి అదరగొట్టాలని ఆకాంక్షిద్దాం.

## సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త

సన్‌రైజర్స్ హైదరాబాద్ (Sunrisers Hyderabad) కెప్టెన్ పాట్ కమిన్స్ (Pat Cummins) కొంతకాలంగా వెన్ను గాయంతో ఇబ్బందిపడుతున్న విషయం తెలిసిందే. అతడు ప్రస్తుత ఐపీఎల్ (IPL) 2026లో ఆడే విషయమై అనిశ్చితి నెలకొంది. అయితే కమిన్స్.. అభిమానులకు ఓ శుభవార్త తెలిపాడు. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టులోకి వస్తానని చెప్పాడు. బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో అతడు పాల్గొన్నాడు. వార్మప్‌లు, ఫీల్డింగ్, క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్‌తో ఖాళీ నెట్స్‌లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు. 'నేను వెన్ను గాయం నుంచి ఇంకా కోలుకుంటున్నా. కానీ ప్రస్తుతం బాగుంది. ఇప్పుడు నెట్స్‌లో బౌలింగ్ చేయగలుగుతున్నా. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. కానీ నేను ప్రారంభ మ్యాచుల్లో ఆడలేకపోతున్నా. టోర్నీ మధ్యలో జట్టులోకి వచ్చే అవకాశముంది. అంతా అనుకున్నట్లు జరిగితే నేను టోర్నమెంట్ రెండో భాగం, ఫైనల్స్‌లో మైదానంలోకి దిగుతాను' అని కమిన్స్ ఓ పాడ్‌కాస్ట్‌లో అన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో మొదటి మ్యాచ్ ఎం.చిన్నస్వామి స్టేడియంలో మార్చి 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (Royal Challengers Bengaluru), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్యన జరగనుంది.




## 'ఇంపాక్ట్'కు నేను వ్యతిరేకం: గిల్

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనకు వ్యతిరేకత పెరుగుతోంది. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్‌ల తర్వాత గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై అభ్యంతరం తెలిపాడు. అది ఆటగాళ్ల నైపుణ్యాన్ని దెబ్బ తీస్తుందని చెప్పాడు. ముంబయిలో ఐపీఎల్ జట్ల కెప్టెన్ల సమావేశంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. "ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను నేను వ్యతిరేకిస్తున్నా. క్రికెట్ 11 మంది ఆట. కానీ ఒక ప్లేయర్ అధికంగా జట్టులో చేరడం.. ఆటగాళ్ల నైపుణ్యాన్ని దెబ్బ తీస్తుంది" అన్నాడు.

అయితే ఈ నిబంధన 2027 వరకు కొనసాగనుంది. గుజరాత్ టైటాన్స్ గురించి మాట్లాడుతూ.. "గత మూడు, నాలుగు సీజన్లలో నేను బాగానే పరుగులు చేశా. కాబట్టి ప్రత్యేకంగా నిరూపించుకోవాల్సిన అవసరం లేదని భావిస్తున్నా. మొదటి నుంచి మేము జట్టుగా స్థిరంగా రాణిస్తున్నాం. ఈసారి కూడా అదే కొనసాగిస్తే మరో ట్రోఫీ గెలుస్తాం" అని పేర్కొన్నాడు. 2022లో ఐపీఎల్‌లో ప్రయాణం ప్రారంభించిన గుజరాత్.. హార్దిక్ పాండ్య సారథ్యంలో తొలి ఏడాదే ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

# ఆర్సీబీ.. ఈసారి కప్పు వదలొద్దని!

ఈ సాలా కప్ నమ్దే.. ప్రతి ఐపీఎల్ ఆరంభానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానుల నినాదం ఇదే. ప్రతిసారి ఎన్నో అంచనాలతో బరిలో దిగడం ఆఖరికి ఉసూరుమనిపించడాన్ని అలవాటుగా మార్చుకున్న ఆర్సీబీ.. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నిరుడు అభిమాని కళ్లలో ఆనందాన్ని నింపింది. మరి ఆ ఆనందం ద్విగుణీకృతం అవుతుందా! తొలిసారి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోన్న ఆర్సీబీ.. చెన్నై, ముంబయి తర్వాత టైటిల్ నిలబెట్టుకున్న మూడో జట్టుగా నిలుస్తుందా..?

రాహుల్ ద్రవిడ్, పీటర్సన్, కుంబ్లే, వెటోరి, కోహ్లి, డుప్లెసిస్ ఇలా ఎంతమంది కెప్టెన్లు మారినా.. 2024 వరకు ఐపీఎల్‌లో బెంగళూరు రాత మారలేదు. కోహ్లి సారథిగా అలుపెరుగని పోరాటం చేసినా.. కోరుకున్న ఫలితం రాలేదు. కానీ 2025లో రజత్ పాటీదార్ సారథ్యంలోని ఆర్సీబీ అద్భుతమే చేసింది. ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి తొలిసారి ట్రోఫీని ముద్దాడింది. పెద్దగా మార్పుల్లేని జట్టుతో ఈసారి బెంగళూరు బరిలో దిగుతోంది. కోల్‌కతా నుంచి రూ.7 కోట్లతో దక్కించుకున్న వెంకటేశ్ అయ్యర్, రూ.2 కోట్లు వెచ్చించి కొన్న పేసర్ జాకబ్ డఫీ జట్టుకు కొత్త ఆకర్షణ. జట్టులో ఎవరున్నా లేకపోయినా అందరి దృష్టి కోహ్లిపైనే ఉంటుందనడంలో సందేహం లేదు. నిరుడు లీగ్ దశలో ఇంట రెండు మ్యాచ్‌లే గెలిచిన బెంగళూరు.. బయట 7 విజయాలతో సత్తాచాటింది. ఈసారి ఇంట కూడా జోరు కొనసాగించాలని చూస్తోంది.


ఏడాదిగా ఆటకు దూరంగా ఉన్న చిన్నస్వామి స్టేడియంలో ఆ జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. నిరుడు ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడంతో చిన్నస్వామిలో మ్యాచ్‌ల నిర్వహణపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. భద్రత ప్రమాణాలు పెంచడంతో ఇటీవలే అనుమతి ఇచ్చారు. మార్చి 28న ఇక్కడ జరిగే ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో బెంగళూరు.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఢీకొంటుంది. ఛాంపియన్‌గా నిలిచిన ఏడాదికే ఆ జట్టు యాజమాన్యం మారిపోయింది. 18 ఏళ్ల నుంచి బెంగళూరు యజమానిగా ఉన్న యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్.. రూ.16706 కోట్లకు ఫ్రాంచైజీని అమ్మేసింది. ఫ్రాంచైజీ చేతులు మారినా కప్పు చేతులు మారకూడదని ఆర్సీబీ పట్టుదలగా ఉంది. మరి ఆ జట్టు ఆశ తీరేనా..!

బలాలు: పటిష్టమైన బ్యాటింగ్ లైనప్పే బెంగళూరుకు అతి పెద్ద బలం. లీగ్ ఆరంభం నుంచి ఆ జట్టుతోనే ఉన్న కోహ్లి.. జట్టు బ్యాటింగ్‌కు వెన్నెముక. 2025లో 15 మ్యాచ్‌ల్లో 657 పరుగులు చేసిన విరాట్‌పైనే ఆర్సీబీ మరోసారి ఆధారపడనుంది. రజత్ పాటీదార్, జాకబ్ బెతెల్, ఫిల్ సాల్ట్, టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, జితేశ్ శర్మ, దేవ్‌దత్ పడిక్కల్‌లతో ఆ జట్టు బ్యాటింగ్ బలంగా ఉంది. గతేడాది 15 మ్యాచ్‌ల్లో 312 పరుగులు చేసిన కెప్టెన్ రజత్ కూడా బెంగళూరుకు కీలకం.

భారత్‌తో టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో వీరోచిత సెంచరీతో ఆకట్టుకున్న ఇంగ్లాండ్ కుర్రాడు బెతెల్‌పై మంచి అంచనాలే ఉన్నాయి. జట్టులో పెద్దగా మార్పులు జరగని నేపథ్యంలో ఎవరి పాత్ర ఏంటన్నదానిపై స్పష్టత ఉంది. కోచ్ ఆండీ ఫ్లవర్ జట్టుకు అదనపు బలం. కొత్తగా వచ్చిన జాకబ్ డఫీ, అనుభవజ్ఞుడు భువనేశ్వర్ కుమార్, గత సీజన్లో 17 వికెట్లు తీసిన స్పిన్నర్ కృనాల్ పాండ్య ఆర్సీబీ బౌలింగ్ లోతును పెంచుతున్నారు.

బలహీనతలు: బ్యాటింగ్, బౌలింగ్‌లో స్టార్ పవర్ ఉన్నా.. స్థిరత్వం లేకపోవడం ఆరంభం నుంచి ఆర్సీబీకి పెద్ద బలహీనత. గత టోర్నీలో కీలక సమయాల్లో ఆ బలహీనతను అధిగమించి విజయాన్ని అందుకుంది. మరి ఈసారి ఎలా ఆడుతుందో చూడాలి. బ్యాటింగ్‌లో ఆ జట్టు భారమంతా కోహ్లినే మోస్తున్నాడు. అతిగా ఆధారపడడం. 2025 టోర్నీలో జట్టు విజేతగా నిలవడంలో కీలకంగా వ్యవహరించిన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ (12 మ్యాచ్‌ల్లో 22 వికెట్లు) గాయంతో ఆరంభంలో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవడం జట్టుకు దెబ్బే. విదేశీ ప్లేయర్ల కూర్పు విషయంలో అస్పష్టత నెలకొంది.

గాయాల చరిత్ర ఉన్న భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్‌లపైనే జట్టు బౌలింగ్ ఎక్కువగా ఆధారపడి వుంది. విదేశీ స్టార్ల స్థాయిలో సత్తా చాటగలిగే దేశీ పేస్ ఆల్‌రౌండర్లు లేకపోవడం ఆర్సీబీకి పెద్ద లోటు. వేలంలో భారీ మొత్తం పెట్టి కొన్న పేస్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ గత సీజన్లో కోల్‌కతా తరఫున 11 మ్యాచ్‌ల్లో 142 పరుగులే చేశాడు. ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. ఆల్‌రౌండర్‌గా అతడిని నమ్ముకునే పరిస్థితి లేదు.




దేశీ ఆటగాళ్లు: విరాట్ కోహ్లి, రజత్ పాటీదార్, జితేశ్ శర్మ, కృనాల్ పాండ్య, రసిఖ్ దార్, భువనేశ్వర్ కుమార్, సుయాశ్ శర్మ, వెంకటేశ్ అయ్యర్, స్వప్నిల్ సింగ్, కనిష్క్ చౌహాన్, అభినందన్ సింగ్, మంగేశ్ యాదవ్, సాత్విక్ దేశ్వాల్, విక్కీ ఓత్వాల్, విహాన్ మల్హోత్రా.

విదేశీయులు: హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్, నువాన్ తుషార, రొమారియో షెపర్డ్, జోర్డాన్ కాక్స్, జాకబ్ బెతెల్, జాకబ్ డఫీ, ఫిల్ సాల్ట్

వీళ్లు కీలకం: కోహ్లి, హేజిల్‌వుడ్, సాల్ట్, బెతెల్, డఫీ, భువనేశ్వర్, కృనాల్ పాండ్య

అత్యుత్తమ ప్రదర్శన: 2025 ఛాంపియన్